


హొళగుంద జడ్పీ ఉన్నత పాఠశాలలో అసంపూర్తిగా ఆగిపోయిన అదనపు గదుల నిర్మాణం

# బడి బాగుండాలని..!

హొళగుంద జడ్పీ ఉన్నత పాఠశాలలో 1,664 మంది విద్యార్థులు ఉన్నారు. అవసరమైన మేరకు తరగతి గదులు లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ.2.34 కోట్లతో 20 అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేపట్టారు. కష్టాలు తీరుతాయని విద్యార్థులు సంతోషించారు. గత వైసీపీ ప్రభుత్వం సకాలంలో నిధులు ఇవ్వకపోవడంతో పిల్లర్లు, మొండి గోడలతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. పిచ్చిమొక్కలు పెరుగుతున్నాయి. హొళగుందలో ఒక్కటే కాదు జిల్లాలో 1,074 ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల పరిస్థితి దాదాపు ఇదే. టీడీపీ కూటమి ప్రభుత్వం కొలువుదీరడంతో వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల అసంపూర్తిగా ఆగిపోయిన నిర్మాణాలపై ప్రత్యేక దృష్టి సారించింది. 'మన బడి-మన భవిష్యత్తు' ఫేజ్-2 కింద తక్షణమే పూర్తి చేయడానికి రూ.29.83 కోట్లు విడుదల చేసింది. రాష్ట్రంలో జిల్లాకే కేటాయించడం కొసమెరుపు. పేద విద్యార్థులు చదువుకొనే ప్రభుత్వ బడులకు మంచి రోజులు వచ్చాయంటూ పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

- జిల్లాలోని పాఠశాలలకు రూ.29.83 కోట్లు విడుదల
- వైసీపీ హయాంలో నిలిచిన నాడు-నేడు పనులు
- టీడీపీ కూటమి వచ్చాక విద్యాలయాల అభివృద్ధిపై దృష్టి
- తక్షణమే 'మన బడి-మన భవిష్యత్తు' ఫేజ్-2 పనులు చేపట్టేలా ఆదేశం

కర్నూలు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రభుత్వ యాజమాన్యం పరిధిలో వివిధ పాఠశాలలు 2,251 ఉన్నాయి. ఆయా విద్యాలయాల్లో 4.50 లక్షలకు పైగా విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. పాఠశాల అభివృద్ధి కోసం వివిధ పథకాల కింద ఏటా రూ.వందల కోట్లు ఖర్చు చేస్తున్నా.. ఇప్పటికీ ఆయా పాఠశాలల్లో కనీస సౌకర్యాలు లేమితో పేద విద్యార్థులు పడుతున్న అవస్థలెన్నో. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ విద్యాలయాల్లో అదనపు తరగతి గదులు, ప్రహరీ, మరుగుదొడ్లు, తాగునీరు, ప్రతి గదిలో ఓ ఫ్యాన్, ట్యూబ్‌లైట్లు, ఫర్నీచర్, రంగులు, మరమ్మతులు, ఆకుపచ్చ శుద్ధ బోర్డు వంటి సౌకర్యాలు కల్పిస్తామని 'నాడు-నేడు' కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా చేపట్టింది. జిల్లాలో ఫేజ్-2 కింద 1,074 ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు ఎంపిక చేసి దాదాపు రూ.521 కోట్లతో 1,746 పనులు చేపట్టారు. కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు తీర్చిదిద్దుతామని ప్రగల్భాలు పలికిన వైసీపీ పెద్దలు ఆచరణలో ఘోర వైఫల్యాన్ని మూటగట్టుకున్నారు. నిధులు ఇవ్వకుండా నిర్లక్ష్యం చేయడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. పనులు చేసిన పాఠశాల యాజమాన్య కమిటీలు అప్పుల ఊబిలో కూరుకుపోయాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక 'మన బడి-మన భవిష్యత్తు' పేరిట విద్యాలయాల్లో మౌలిక వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నారు. విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అసంపూర్తి పనులపై దృష్టి సారించారు.





అసంపూర్తిగా ఆలూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ప్రహరీ నిర్మాణం

### అసంపూర్తి పనులు.. అవస్థల్లో విద్యార్థులు:

జిల్లాలో 1,074 వివిధ ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో 'మన బడి నాడు-నేడు' ఫేజ్-2 కింద 1,746 పనులు గుర్తించారు. అందులో 311 పాఠశాలల్లో 1,311 అదనపు తరగతి గదులు, 367 పాఠశాలలకు ప్రహరీ నిర్మాణ పనులు మంజూరు చేశారు. 35-40 శాతం పనులు పూర్తి చేయలేదు. అదనపు తరగతి గదులు, మరుగుదొడ్లు, వంట గదులు.. ఇలా వివిధ నిర్మాణాలు పిల్లర్లు, మొండి గోడలతో అసంపూర్తిగా ఆగిపోయాయి. సకాలంలో నిధులు ఇవ్వకపోవడం, బిల్లులు కూడా రాకపోవడంతో పనులు చేసిన పాఠశాలల యాజమాన్య కమిటీలు ఎక్కడి పనులు అక్కడే ఆపేశారు. అసంపూర్తి పనుల వల్ల విద్యార్థులకు అవస్థలు తప్పడం లేదు. 2024 జూన్ 12న కొలుదీరిన టీడీపీ కూటమి ప్రభుత్వం 'మన బడి-మన భవిష్యత్తు' ఫేజ్-2 కింద అసంపూర్తి పనులు పూర్తి చేసేందుకు శ్రీకారం చుట్టింది.

### గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల ఆగిపోయిన పనులు కొన్ని

- హొళగుంద జడ్పీ ఉన్నత పాఠశాలలో 1,664 మంది విద్యార్థులు చదువుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వం హయాంలో నాడు-నేడు కింద రూ.2.34 కోట్లతో 20 అదనపు తరగతి గదులు మంజూరు కాగా.. 9 గదుల నిర్మాణాలు మొదలు పెట్టారు. మూడు గదులు టాప్ లెవల్, ఆరు గదులు లెంటిల్ లెవల్‌లోనే అసంపూర్తిగా ఆపేశారు. గత వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారింది. టీడీపీ కూటమి ప్రభుత్వం నిధులు ఇవ్వడంతో పనులు మొదలు కానున్నాయి.
- ఆలూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో 50 మంది విద్యార్థులు ఉన్నారు. రూ.32 లక్షలతో ప్రహరీ నిర్మాణం చేపట్టారు. నాడు నిధులు ఇవ్వకపోవడంతో పనులు ఎక్కడికక్కడే ఆగిపోయాయి.
- కోసిగి మండలం చిన్నభొంపల్లి గ్రామం జడ్పీ ఉన్నత పాఠశాలలో 678 మంది విద్యార్థులు విద్యాభ్యాసం చేస్తున్నారు. రూ.1.20 లక్షలతో అదనపు తరగతి గదుల నిర్మాణాలు చేపట్టారు. రూ.76 లక్షలు ఖర్చు చేశారు. బిల్లులు రాకా.. అవసరమైన నిధులు మరో రూ.40 లక్షలు ఇవ్వకపోవడంతో పనులు ఆగిపోయాయి. విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- దేవనకొండ మండలం కరివేముల జడ్పీ ఉన్నత పాఠశాలలో జీ+1 తరహాలో 8 అదనపు తరగతి గదులు, వంటగతి, తాగునీటి సంప్, ప్రహరీ నిర్మాణాలకు రూ.1.50 లక్షలు మంజూరు చేశారు. 70 శాతం పనులు పూర్తయినా.. ఆ తరువాత నిధులు రాకపోవడంతో అసంపూర్తిగా ఆపేశారు. తెర్నేకల్లు జడ్పీ ఉన్నత పాఠశాలలో రూ.2.16 కోట్లతో 18 అదనపు తరగగి గదులు నిర్మాణం చేపట్టినా మొదటి అంతస్తు పైకప్పు లెవల్‌లో ఆగిపోయాయి. గుండ్లకొండ జడ్పీ ఉన్నత పాఠశాలలోనూ దాదాపు ఇదే పరిస్థితి ఉంది.

మిగతా 7వ పేజీలో

## కవయిత్రి మొల్లకు నివాళి

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): సంస్కృత రామాయణాన్ని తెలుగుభాషలోకి అనువదించిన తొలి వెలుగు కవయిత్రి మొల్ల అని కలెక్టర్ రంజిత్ బాషా పేర్కొన్నారు. మొల్లమాంబ జయంతిని కలెక్టరేట్‌లో ఘనంగా నిర్వహించారు. ముందుగా కలెక్టర్ రంజిత్ బాషా పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాల్మీకి రచించిన రామాయణాన్ని సరళంగా అర్థమయ్యేలా తెలుగు బాషలోకి రచించిన విషయం అందరు స్మరించుకోవడం గర్వించదగ్గ విషయమన్నారు. వ్యవహారికభాషలో అందరికీ అర్థమయ్యే విదంగా రామయాణాన్ని చక్కగా వివరించడంలో ఆమె పాత్ర ఎంతో కీలకమన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ వెల్ఫేర్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, సెట్కూరు సీఈవో వేణుగోపాల్, ఆఫీసు సూపరింటెండెంట్ శ్రీధర్, కుమ్మరి శాలివాహన సంక్షేమ సంఘం మాజీ అధ్యక్షుడు సుగూరు వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు సోమేష్, నాయకులు నాగేశ్వరరావు, బజారప్ప, కేసీ నాగన్న, లింగన్న, మధు, రామచంద్ర, నరసింహబాబు, వేంపెంట రాంబాబు, వలసల రామకృష్ణ, వెంకటేశ్, ధనుంజయ ఆచారి తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

## కిడ్నీలు కాపాడుకోండి

### కర్నూలులో ఐఎంఏ వైద్యుల అవగాహన ర్యాలీ

కర్నూలు హాస్పిటల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మానవ శరీరంలో కీలకమైన కిడ్నీలను ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా సంరక్షించుకోవాలని వైద్యులు సూచించారు. వరల్డ్ కిడ్నీ డేను పురస్కరించుకుని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) ఆధ్వర్యంలో గురువారం ఉదయం నగరంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఐఎంఏ జాయింట్ సెక్రటరీ సీనియర్ నెఫ్రాలజిస్టు డాక్టర్ వై.సాయివాణి నేతృత్వంలో నగరంలోని రాజ్‌విహార్ సర్కిల్‌లో ఏర్పాటు చేసి ర్యాలీని రవీంద్ర విద్యాసంస్థల చైర్మన్ పుల్లయ్య జెండా ఊపి ప్రారంభించారు. అనంతరం ఈ ర్యాలీ రాజ్‌విహార్ నుండి కొండారెడ్డి బురుజు వరకు కొనసాగింది. ఈ సందర్భంగా నెఫ్రాలజిస్టు డాక్టర్ వై సాయివాణి మాట్లాడుతూ మంచి ఆహారపు అలవాట్లతో కిడ్నీని కాపాడుకోవచ్చని, 40 ఏళ్లు పైబడిన వారు కిడ్నీ పరీక్షలను చేయించుకోవాలన్నారు. మధుమేహం, బీపీని అదుపులో ఉంచుకోవాలని, కిడ్నీ వ్యాధులకు నిర్వహించే చికిత్స (డయాలసిస్) వల్ల చాలా నీరు వృథాగా పోతాయనీ, ప్లాస్టిక్ వ్యర్థాలు ఎక్కువవుతాయనీ, కావున కిడ్నీ వ్యాధులను ప్రాథమిక దశలో గుర్తించి చికిత్స చేయించుకోవాలన్నారు. ఐఎంఏ కర్నూలు సెక్రటరీ ఎస్‌వీ రామ్మోహన్ రెడ్డి, ఐఎంఏ కోశాధికారి మాధవీశ్యామల మాట్లాడుతూ కిడ్నీ జబ్బు తొలిదశలో గుర్తించి సరైన వ్యాయామం, మంచి ఆహారం మందులతో జబ్బును అదుపులో ఉంచుకోవచ్చునన్నారు. రోజుకు కనీసం 2 లీటర్ల నీరు తాగాలని, ఆహారంలో ఉప్పు సోడియంను మితంగా వాడాలన్నారు. ర్యాలీలో ఐఎంఏ ఉమెన్ వింగ్ సెక్రటరీ డాక్టర్ విష్ణుప్రియ కర్నూలు జీజీహెచ్ నెఫ్రాలజీ హెచ్‌వోడీ డాక్టర్ అనంత్, ఎండో క్రైనాలజిస్టు డాక్టర్ పి.శ్రీనివాసులు, సీనియర్ క్యాన్సర్ శస్త్ర చికిత్స నిపుణులు డాక్టర్ బి.రవీంద్రబాబు, వైద్యులు పాల్గొన్నారు.




ర్యాలీలో మాట్లాడుతున్న నెఫ్రాలజిస్టు డాక్టర్ సాయివాణి

## న్యూస్ బాక్స్

### 28న డాక్ అదాలత్

కర్నూలు న్యూసిటీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పోస్టాపీసులో అందిస్తున్న సేవలపై ఈనెల 28న డాక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కర్నూలు డివిజనల్ పోస్టల్ సూపరింటెండెంట్ జి. జనార్దనరెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పాతబస్టాండు వద్ద ప్రధాన తపాలా కార్యాలయంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. డాక్ అదాలత్‌కు పోస్టాపీసు సేవలపై ప్రజలకు ఏవైనా సమస్యలు ఉంటే పోస్టు కవర్ ద్వారా పోస్టల్ సూపరింటెండెంట్ జి. జనార్దనరెడ్డి, కర్నూలు డివిజనల్ కార్యాలయం, పాత బస్టాండు అడ్రసుకు ఈ నెల 24వ తేదీ లోగా పంపాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

### ఇంటర్ పరీక్షల్లో 623 మంది గైర్హాజరు

కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం పబ్లిక్ పరీక్షలు గురువారం ప్రశాంతంగా జరిగాయి. జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం విద్యార్థులు మొత్తం 23,144 మంది విద్యార్థులు నమోదు చేసుకున్నారు. 22,470 మంది పరీక్షకు హాజరు కాగా, ఇందులో 623 మంది గైర్హాజరయ్యారు. ఎలాంటి మాల్ ప్రాక్టీసు కేసు నమోదు కాలేదు. మొదటి సంవత్సరం ఇంటర్ జనరల్ పరీక్షలు పూర్తయ్యాయి. శుక్రవారం రెండో సంవత్సరం ఇంటర్ జనరల్ కోర్సుల పరీక్షలు పూర్తి కానున్నాయి. మొత్తానికి ఇంటర్ పరీక్షలు పూర్తి కావడంతో విద్యార్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ పరీక్ష కేంద్రాలను ఆర్‌ఐవో గురువయ్యశెట్టి ఆధ్వర్యంలో డీవీఈవో పరమేశ్వరరెడ్డి, స్పెషల్ ఆఫీసర్ జి.లాలెప్ప, డీఈసీ కమిటీ సభ్యులు సిట్టింగ్, ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు పరీక్ష కేంద్రాలను పర్యవేక్షించారు.

### లా సెమిస్టర్ ఫలితాలు విడుదల

కర్నూలు అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి): రాయలసీమ యూనివర్సిటీ పరిధిలో 3, 5 సంవత్సరాలకు సంబంధించిన 2,4,6,8,10 సెమిస్టర్ ఫలితాలను పరీక్షల విభాగం కంట్రోలర్ డాక్టర్ ఎస్.వెంకటేశ్వర్లు విడుదల చేశారు. గురువారం ఉదయం ఉపకులపతి డాక్టర్ వి.వెంకట బసవరావు ఆదేశాల మేరకు వివరాలను వర్సిటీ వెబ్‌సైట్‌లో ఉంచినట్లు తెలిపారు.

### ఎమ్మెల్సీగా బీటీ నాయుడు ఏకగ్రీవం



కర్నూలు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మెల్యే కోటా ఎమ్మెల్సీ స్థానం కోసం పోటీ చేసిన టీడీపీ అభ్యర్థి, తాజా ఎమ్మెల్సీ బీటీ నాయుడు ఎన్నిక ఏకగ్రీవమైంది. ఈ మేరకు ఎమ్మెల్సీ ఎన్నికల రిటర్నింగ్ అధికారి (ఆర్‌వో), శాసనమండలి డిప్యూటీ సెక్రెటరీ వనితారాణి గురువారం అధికారికంగా ప్రకటించారు. ఈ నెల 29తో ఖాళీ అవుతున్న ఐదు ఎమ్మెల్సీ ఎన్నికలకు కేంద్ర ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేసిన సంగతి తెలిసిందే. పొత్తుల్లో భాగంగా కూటమి భాగస్వామ్య పార్టీలు జనసేన, బీజేపీలకు ఒక్కొక్క స్థానం కేటాయించగా.. మూడు ఎమ్మెల్సీలకు టీడీపీ పోటీ చేసింది. రాయలసీమ జిల్లాల నుంచి వాల్మీకి/బోయ సామాజిక వర్గానికి చెందిన తాజా ఎమ్మెల్సీ బీటీ నాయుడును ఎమ్మెల్సీ అభ్యర్థిగా ఎంపిక చేశారు. గత 10వ తేదిన నామినేషన్ దాఖలు చేశారు. 11న నామినేషన్ల పరిశీలన, 12న విత్‌డ్రాల పర్వం ముగిసింది. ఐదు స్థానాలకు ఒక్కొక్క నామినేషన్ దాఖలు కావడంతో ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ఆర్‌వో అధికారికంగా ప్రకటించారు.

## నేత్రపర్వం.. నృసింహుడి రథోత్సవం

- ఎగువ అహోబిలంలో ఘనంగా రథోత్సవం
- దిగువలో కాళింగ నర్తనోత్సవం, తొట్టి తిరుమంజనం
- అశ్వ వాహనంపై విహరించిన ప్రహ్లాదవరదస్వామి

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), మార్చి 13(ఆంధ్రజ్యోతి): 'జయజయ సింహ.. జయనారసింహ..' నినాదాలతో ప్రముఖ వైష్ణవక్షేత్రం అహోబిలం మార్మోగింది. వేలాది గొంతుకలు గోవిందనామస్మరణతో చేస్తుండగా జ్వాలా నరసింహస్వామి బ్రహ్మ రథోత్సవం వైభవంగా సాగింది. బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఉభయదేవేరులతో కొలువైన జ్వాలా నరసింహస్వామి ఉత్సవమూర్తులకు అర్చకులు ఉదయం శాస్త్రోక్తంగా నవకలశ తిరుమంజనం, పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీదేవీ, భూదేవీ సమేత జ్వాలా నృసింహస్వామి ఉత్సవమూర్తులను పట్టుపీతాంభరాలు, పుష్పమాలలతో అలంకరించి మేళతాళాలతో ఆలయం వెలుపల ఉన్న రథం వరకు తీసుకొచ్చారు. శోభాయమానంగా ముస్తాబు చేసిన రథంలో స్వామి, అమ్మవార్లను కొలువుదీర్చి రథాంగ పూజలు, మంగళహారతి సమర్పించి రథోత్సవాన్ని ప్రారంభించారు. అహోబిల మఠం 46వ పీఠాధిపతి శ్రీవణ్ శఠగోప శ్రీ రంగనాథ యతీంద్ర మహాదేశికన్, ఆలయ ప్రధాన అర్చకులు కిడాంబి వేణుగోపాలన్, మణియార్ సౌమ్యనారాయణన్ ఆధ్వర్యంలో రథోత్సవ వేడుకలు జరిగాయి.



అశేష భక్తవాహిని నడుమ కొనసాగుతున్న రథోత్సవం



శ్రీదేవీ, భూదేవీ సమేతంగా దర్శనమిస్తున్న శ్రీవారు

### ఘనంగా 'కాళింగ నర్తనోత్సవం'

బ్రహ్మోత్సవాల్లో భాగంగా దిగువ అహోబిల క్షేత్రంలో శ్రీదేవీ, భూదేవీ సమేత ప్రహ్లాదవరదస్వామి ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించి కాళింగనర్తనోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించి పల్లకిలో కొలువుంచి కమనీయంగా గ్రామోత్సవం నిర్వహించారు. పట్టువస్త్రాలతో శోభాయమానంగా అలంకరించిన ప్రహ్లాదవరదస్వామి అశ్వ వాహనంపై కొలువుదీరి ఆలయ మాడవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిచ్చారు. దిగువ అహోబిలంలో శుక్రవారం వైభవంగా రథోత్సవం నిర్వహించనున్నారు.

## రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం: ఎస్పీ

**కర్నూలు క్రైం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):** రోడ్డు ప్రమాదాలను నివారణే తమ లక్ష్యమని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ నేర నివారణే లక్ష్యంగా విజిబుల్ పోలిసింగ్ పని చేస్తుందన్నారు. గత ఫిబ్రవరి నెలలో పోలీసులు తీసుకున్న చర్యలను ఆయన గురువారం తెలియజేశారు. రోడ్డు భద్రత నిబంధనల ఉల్లంఘనలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించి డ్రంకెన్ డ్రైవ్‌లో 1022 కేసులు నమోదు చేసి ఒక్కొక్కరిపై రూ.3వేలు జరిమానా విధించామన్నారు. అలాగే ఓపెన్ డ్రింకింగ్ కేసులు 1976 నమోదు చేసి ఒక్కొక్కరికి రూ.1000 జరిమానా విధించామన్నారు. ఎక్కడైనా చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే.. బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్న వారిపై డ్రోన్ కెమెరాలతో గట్టి నిఘా పెట్టామని తెలిపారు. రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకుంటే వెంటనే డయల్ 100 లేదా డయల్ 112, పోలీసులకు సమాచారం ఇవ్వాలని తెలిపారు. జిల్లా ప్రజలు హోలీ పండుగను ప్రశాంత వాతావరణంలో జరుపు కోవాలని ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. జిల్లా ప్రజలకు ఆయన హోలీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

## ట్రేడ్ లైసెన్సు బకాయిలపై కొరడా

### బకాయిలు చెల్లించని దుకాణాలు సీజ్


దుకాణానికి తాళం వేస్తున్న కార్పొరేషన్ అధికారులు

**కర్నూలు న్యూసిటీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** నగరంలో ట్రేడ్ లైసెన్సు చెల్లించని దుకాణాలపై కార్పొరేషన్ అధికారులు కొరడా ఝులిపించారు. గురువారం శానిటరీ సూపర్‌వైజర్ నాగరాజు ఆధ్వర్యంలో నగరంలోని పలు ప్రాంతాలలో బకాయిలు చెల్లించని దుకాణాలను సీజ్ చేశారు. బకాయిదారులకు వినూత్నంగా పువ్వులతో విజ్ఞప్తి చేశారు. మొండిబకాయిలు ఉన్న దుకాణాల వద్ద నిరసన వ్యక్తం చేశారు. సహకరించని దుకాణాలను సీజ్ చేశారు. ఈసందర్భంగా నాగరాజు మాట్లాడుతూ వ్యాపారులు ప్రతి ఏడాది ట్రేడ్ లైసెన్సును పునరుద్ధరణ చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్స్‌పెక్టర్లు లోకేష్, జిలాని, మునిస్వామి, ముర్తుజావలి, కార్యదర్శులు పాల్గొన్నారు.

## కాల్వబుగ్గలో 16 రోజుల పండుగ


అమ్మవారికి పూజలు చేస్తున్న ఉత్సవ కమిటీ సభ్యులు, భక్తులు

**ఓర్వకల్లు, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** కాల్వబుగ్గ రామేశ్వరస్వామి ఆలయంలో గురువారం 16 రోజుల పండుగ నిర్వహించారు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని పదహారు రోజుల పండుగ సందర్భంగా ఆలయ ప్రధాన అర్చకులు కల్లె లక్ష్మీనారాయణ శర్మ, కల్లె లక్ష్మీనరసింహ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఈవో మద్దిలేటి, ఉత్సవ కమిటీ సభ్యులు కాకి దేవేంద్ర, భక్తులు, బజారు, జయకృష్ణ, నాగభూషణం శెట్టి పాల్గొన్నారు.

## ఆరోగ్య శాఖలో బదిలీలు

**కర్నూలు హాస్పిటల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** ఆరోగ్య శాఖలో బదిలీలు జరిగాయి. అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు అడిషనల్ డీఎంహెచ్‌వోగా పని చేస్తున్న డాక్టర్ ప్రభావతిదేవి కర్నూలు మెడికల్ కాలేజీ రీజనల్ పబ్లిక్ హెల్త్ ల్యాబోరేటరీ సివిల్ సర్జన్ బ్యాక్టీరియాలజిస్టుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గురువారం వైద్యఆరోగ్య శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు ఆదేశాలు జారీ చేశారు. ఏడాది కాలం ఫారిన్ సర్వీసు కింద కర్నూలు మెడికల్ కాలేజీకి వేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే కర్నూలు జిల్లా వైద్య ఆరోగ్య శాఖలో ఆర్‌బీఎస్‌కే జిల్లా కో-ఆర్డినేటర్‌గా పని చేస్తున్న హేమలత, గడువు ముగియడంతో ఆమెను కడప ప్రభుత్వ వైద్యకళాశాల డిప్యూటీ డైరెక్టర్‌గా పోస్టింగ్ ఇస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## ఈకేవైసీ చేసుకోవాలి: తహసీల్దార్

**కోడుమూరు రూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** మండలంలోని రైస్ కార్డులలో ఈకేవైసీ పెండింగ్ ఉన్నవారంతా పూర్తిచేసుకోవాలని తహసీల్దార్ వెంకటేశ్ నాయక్ కోరారు. గురువారం తహసీల్దార్ మాట్లాడుతూ రేషన్ కార్డుదారులు డీలర్, వీఆర్వో లాగిన్‌లో ఈకేవైసీ పూర్తి చేసుకో వచ్చని అన్నారు.

**గూడూరు:** రేషన్‌కార్డుదారులు తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని తహసీల్దార్ రామాంజనేయులు అన్నారు. గురువారం గూడూరు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డులో ఈకేవైసీ పెండింగ్ ఉన్న వారంతా వెంటనే వీఆర్వో, డీలర్‌ను కలిసి ఈకేవైసీని చేయించుకోవాలన్నారు.

## అంబేడ్కర్ వర్సిటీని ఏర్పాటు చేయాలి

**కర్నూలు అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సార్వత్రిక విశ్వవిద్యాలయం రాష్ట్రంలో ఏర్పాటు చేయాలని ఏఐఎస్ఏ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నాగరాజు డిమాండ్ చేశారు. గురువారం నగరం లోని ఓపెన్ అంబేడ్కర్ స్టడి సెంటర్ ఎదుట అఖిల భారత విద్యార్థి సంఘం (ఏఐఎస్ఏ) ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాగరాజు మాట్లాడుతూ 1982లో మాజీ సీఎం ఎన్టీ రామారావు ఆంధ్రప్రదేశ్ సార్వత్రిక విశ్వవిద్యాలయం ఏర్పాటు చేశారని, తర్వాత 1991లో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీగా ప్రభుత్వం మార్చిందని, రాష్ట్ర విభజన అనంతరం పదేళ్లపాటు ఉమ్మడి కొనసాగిం చారని, కానీ ఆ కాలం పూర్తి అయినప్పటికి అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీని ఏర్పాటు చేయడంలో నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. కార్యక్రమంలో నాయకులు పెద్దయ్య, నాని, సతీష్ పాల్గొన్నారు.

## పొదుపు మహిళలకు న్యాయం చేయాలి

**కర్నూలు కలెక్టరేట్, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** ఏపీఎం, సీసీలు చేసిన అవకతవకలపై విచారణ చేసి పొదుపు మహిళలకు న్యాయం చేయాలని కోరుతూ గురువారం కలెక్టరేట్‌లో డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ ఆఫీసు ముందు ఏస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్యవేదిక సభ్యులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు పట్నం రాజేశ్వరి మాట్లా డుతూ పత్తికొండ నియోజకవర్గంలో గత మూడు నెలలుగా పొదుపు మహిళల సమావేశం నిర్వహించకుండా నిబంధనలకు విరుద్ధంగా తెలుగు మహిళా అనే మహిళను వీవోఏగా నియమించారని ఆరోపిం చారు. అక్రమంగా నియమితులైన వారిని తొలగించాలన్నారు. కార్యక్ర మంలో నంది విజయలక్ష్మి, కేడీ లలిత, లలిత బాయి, వరలక్ష్మి పాల్గొన్నారు.

## న్యాయ వ్యవస్థను అవమానిస్తున్న ప్రభుత్వం

**కర్నూలు న్యూసిటీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** న్యాయ వ్యవస్థను కూటమి ప్రభుత్వం అవమానిస్తుందని వైసీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి మద్దూరు సుభాష్ చంద్రబోసు అన్నారు. గురువారం కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఒక కోర్టులో బెయిల్ వస్తే ఇంకొక కోర్టులో అదే అంశంపై మరో కేసు నమోదు చేసి అరెస్టు చూపించి పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తున్నారన్నారు. ప్రభు త్వమే ఒక వ్యక్తిపై కక్షగట్టి 15, 20 కేసులు పెట్టి వేధించడం సరికాదన్నారు నేడు పోసాని రేపు ఇంకెవరైనా కావచ్చని, తప్పు చేసి ఉంటే చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు.

# ప్రకృతి వ్యవసాయంపై దృష్టి సారించాలి

### జాయింట్ కలెక్టర్ బి.నవ్య


మాట్లాడుతున్న జాయింట్ కలెక్టర్ నవ్య

**కర్నూలు అగ్రికల్చర్, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలని జాయింట్ కలెక్టర్ బి.నవ్య అన్నారు. గురువారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయం, అనుబంధ శాఖలతో ఖరీఫ్, కార్యాచరణ ప్రణాళిక 2025-26 రైతుసాధికారత సంస్థ, ప్రకృతి వ్యవసాయంపై జిల్లా స్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా జాయింట్ కలెక్టర్ బి.నవ్య హాజరై ప్రసంగించారు. వ్యవ సాయ శాఖకు చెందిన అన్ని విభాగాల అధికారులు, సిబ్బంది గ్రామ స్థాయిలో ప్రకృతి వ్యవసాయాన్ని రైతులంతా చేసేలా ప్రోత్సహించేందుకు చర్యలు చేపట్టాలన్నారు. పంట సాగు వల్ల రైతులు బాగు పడాలంటే తప్పనిసరిగా రసాయన ఎరువులను, క్రిమిసంహారక మందులను వాడకుండా తక్కువ ఖర్చుతో గ్రామాల్లోనే జీవామృతాలను తయారు చేసుకునేలా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. గ్రామ స్థాయిలోనే లక్ష్యాలను నిర్దేశించుకుని కార్యాచరణ ప్రణాళికతో ప్రకృతి వ్యవసాయాన్ని విస్తరించాలని వ్యవ సాయ శాఖ, అనుబంధ శాఖల అధికారులను ఆదేశించారు. ఈ సమా వేశంలో డీఆర్‌డీఏ పీడీ రమణారెడ్డి, వ్యవసాయ శాఖ జేడీ వరలక్ష్మి, ఏపీఎంఐపీ పీడీ ఉమాదేవి, హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు, ఫిషరీస్ జేడీ శ్యామల, మార్కెటింగ్ శాఖ ఏడీఎం నారాయణమూర్తి, లక్ష్మయ్య, ఏడీఏలు, డీఆర్‌డీఏ ఏపీడీలు పాల్గొన్నారు.

# కర్నూలు జీజీహెచ్‌లో వరల్డ్ కిడ్నీ దినోత్సవం


నెఫ్రాలజిస్టు డాక్టర్ శశికిరణ్‌ను సన్మానిస్తున్న మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్, సూపరింటెండెంట్, నెఫ్రాలజీ వైద్యులు

**కర్నూలు హాస్పిటల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):** కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో వరల్డ్ కిడ్నీ దినోత్సవం గురువారం నిర్వహించారు. కార్యక్రమానికి హైదరాబాదు యశోద హాస్పిటల్‌కు చెందిన సీనియర్ నెఫ్రాలజిస్టు డాక్టర్ ఎ.శశికిరణ్ హాజరై మాట్లాడారు. మంచి ఆహారపు అలవాట్లు, వ్యాయామం చేయడంతో కిడ్నీలను కాపాడుకోవచ్చునని అన్నారు. కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఓల్డ్ సీఎల్‌జీలో నెఫ్రాలజీ విభాగం హెచ్‌వోడీ డా.సోమ అనంత్ అధ్యక్షతన వైద్యవిజ్ఞాన సదస్సును కేఎంసీ ప్రిన్సిపాల్ కె.చిట్టినరసమ్మ, ఆసుపత్రి సూపరిం టెండెంట్ డా.కే.వెంకటేశ్వర్లు ప్రారంభించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్, ప్రిన్సిపాల్ మాట్లాడుతూ దీర్ఘకాలిక మూత్రపిండాల వ్యాధి గురించి అవగాహన పెంచుకోవాలన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి డిప్యూటీ సూపరింటెండెంట్లు డాక్టర్ కె.సీతారామయ్య, డి.శ్రీరాములు, నెఫ్రాలజీ విభాగపు ప్రొఫెసర్ డాక్టర్ పీఎస్ జిక్కి, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ వెంకట ఫక్కీరెడ్డి, శ్రీధర్ వర్మ పాల్గొన్నారు.

**మెడికవర్ హాస్పిటల్‌లో...** చాలా మందిలో కాళ్లలో వాపు, అలసట వంటి లక్షణాలు ఉంటాయని, వాటిని నిర్లక్ష్యం చేస్తే అవి దీర్ఘకాలిక కిడ్నీ వ్యాధి (సీకేడీ)కు దారి తీస్తాయని కర్నూలు మెడికవర్ హాస్పిటల్ కన్సల్టెంట్ నెఫ్రాలజిస్టులు డాక్టరు సిద్దార్థ్ హేదూర్, యురాలజీస్టు డాక్టర్ అబ్దుల్ సమద్ హెచ్చరించారు. గురువారం మెడికవర్ హాస్పిటల్‌లో కిడ్నీ జబ్బులపై అవగాహన సదస్సు జరిగింది.

**జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌లో:** వరల్డ్ కిడ్నీ డే సందర్భంగా జెమ్‌కేర్ కామినేని హాస్పిటల్‌లో 35 మంది డయాలసిస్ రోగులను సన్మానించారు. ఈ సందర్భంగా నెఫ్రాలజిస్టు డాక్టర్లు రవికుమార్, మహాంకాళి మా ట్లాడుతూ కిడ్నీలు పూర్తిగా పని చేయడం మానేసినప్పుడు డయాలసిస్ లేదా కిడ్నీ మార్పిడి అవసరమన్నారు. అనంతరం హాస్పిటల్ సీఈవో డాక్టర్ చంద్రశేఖర్, నెఫ్రాలజిస్టు డాక్టర్ రవికుమార్, యురాలజిస్టు సతీష్, డైరెక్టర్ డాక్టర్ రవిబాబు, వరల్డ్ కిడ్నీ డే స్పెషల్ ప్యాకేజీ బ్రోచర్‌ను విడుదల చేశారు.

## అదనపు ఆర్థిక సాయాన్ని వినియోగించుకోవాలి: కలెక్టర్

**కర్నూలు కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):** రాష్ట్ర ప్రభుత్వం పేదల ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసుకునేందుకు ఆప్షన్ 1, 2 ఇళ్ల నిర్మాణాలకు బీసీ, ఎస్సీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు ఇచ్చే ఆర్థిక సాయాన్ని వినియోగించుకోవాలని కలెక్టర్ రంజిత్ బాషా అన్నారు. గురువారం హౌసింగ్, స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర, ఉపాధి హామీ పనుల కల్పనపై స్పెషల్ ఆఫీసర్లు, ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్లు, ఏపీడీలు, ఏపీవోలతో కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 9446 మంది లబ్ధిదారులను అర్హులుగా గుర్తించామన్నారు. బీసీ, ఎస్సీలకు రూ.1.80లక్షలకు బదులుగా రూ.2.30లక్షలు అందుతాయని, ఎస్టీలకు రూ.2.55 లక్షలు, అందుతుందన్నారు. ప్రతి నెలా మూడో శనివారం స్వర్ణాంధ్ర - స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించ డంలో భాగంగా ఈ నెల 15న ప్రతి గ్రామం, వార్డులో పరిశుభ్రత కార్యక్ర మాలు నిర్వహించాలన్నారు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నివారించండి.. రీయూజబుల్‌ను ప్రమోట్ చేయండి అన్న థీమ్‌తో జరుగుతున్న ఈ కార్యక్రమం ద్వారా ప్లాస్టిక్ వినియోగానికి దూరంగా ఉండేలా ప్రజలకు అవగాహన కల్పించాలని ఆదేశించారు. కుటుంబానికి వంద పని దినాలు కల్పించడంలో బాగంగా పత్తికొండ, సి.బెళగల్, హొళగుంద మండలాల్లో తక్కువ పురోగతి సాధించారన్నారు. ఈకాన్ఫరెన్స్‌లో హౌసింగ్ పీడీ అజయ్ కుమార్, జడ్పీ సీఈవో నాసరరెడ్డి పాల్గొన్నారు.

## 16న లలితాదేవికి సహస్ర గళార్చన

**కర్నూలు కల్చరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** నగరంలోని శ్రీమాతా సత్సంగ్ ఆధ్యాత్మిక సంస్థ ఆధ్వర్యంలో ఈనెల 16న లలితాదేవి అమ్మవారికి వెయ్యి మంది మాతృమూర్తులతో సహస్ర గళార్చన, సౌందర్యలహరి శ్లోక పారాయ ణంతో శతాధిక హారతుల సమర్పణ ఏర్పాటు చేసినట్లు ఆ సంస్థ నిర్వాహకులు సత్యనారాయణ శర్మ, శ్రీదేవిలు ఒక ప్రకటనలో తెలిపారు. నగర శివారు గుత్తిరోడ్డులోని కేఎస్ఆర్ కన్వెన్షన్ ఫంక్షన్ హాలులో 16న ఉదయం 9 గంటలకు ఈ కార్యక్రమాలు ప్రారంభమవుతాయని వారు పేర్కొన్నారు. గత 16 ఏళ్లుగా శ్రీమాతా సత్సంగ్ ఆధ్యాత్మిక సంస్థ ధార్మిక సేవలు అందిస్తోందని, ఈ కార్యక్రమానికి అధిక సంఖ్యలో భక్తులు హాజరు కావాలని కోరారు.

## ఉద్యోగాలకు ఎంపిక

**కర్నూలు ఎడ్యుకేషన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** ఎ.క్యాంపు మైఫర్ కళా శాలలో డీవీఎస్ ల్యాబ్ క్యాంపస్ రిక్రూట్‌మెంటు బుధవారం జరిగింది. డీవీసీ ల్యాబ్ హెచ్‌ఆర్ రవికృష్ణ, నవీన్ ఆధ్వర్యంలో క్యాంపస్ రిక్రూట్ మెంటు జరిగింది. ఈ ఉద్యోగాల ఎంపికకు మొత్తం 200 మంది విద్యార్థులు హాజరు కాగా, 70 మందిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డాక్టర్ ఆదిమూలపు సతీష్, ప్రిన్సిపాల్ డాక్టర్ కె.మహాలక్ష్మి, వైస్ ప్రిన్సిపాల్స్ మహాలక్ష్మి, కాసర్ల సురేష్, అకడమిక్ డీన్ రాజ్‌కుమార్, ఫ్యాకల్టీ, విద్యార్థులు పాల్గొన్నారు.

## సీఐడీ విచారణ వేగవంతం చేయాలి

### ఆర్‌యూ ఎదుట విద్యార్థి జేఏసీ ఆధ్వర్యంలో నిరసన


నిరసన తెలుపుతున్న విద్యార్థి జేఏసీ నాయకులు

**కర్నూలు అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** ఆర్‌యూలో అవినీతికి పాల్పడిన మాజీ అధికారిపై సీఐడీ విచారణ వేగవంతం చేయాలని విద్యార్థి జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీ ఎదుట నిరసన తెలిపారు. ట్రైబల్ స్టూడెంట్స్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప, భీమ్ ఆర్మీ రాష్ట్ర కన్వీనర్ ఎస్.విజయ భాస్కర్, అంబేడ్కర్ స్టూడెంట్ అసోసియేషన్ కన్వీనర్ మధుక్రిష్ణలు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రక్షాళన చేసేందుకు తీసుకున్న నిర్ణయం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో టీఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వెంకటేష్, అంజి, లోక్‌నాయక్, శివ పాల్గొన్నారు.

## పేద ముస్లింలకు ఇంటి స్థలం ఇవ్వాలి



కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న పేద ముస్లింలు

**కర్నూలు న్యూసిటీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** పేద ముస్లింలకు రెండు సెంట్ల స్థలం ఇవ్వాలని సీపీఐ నగర కార్యదర్శి పి.రామక్రిష్ణారెడ్డి డిమాండ్ చేశారు. గురువారం కలెక్టరేట్ ఎదుట పేద ముస్లింలతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జొహరాపురం గ్రామ రెవెన్యూ పరిధిలోని వక్ఫ్‌బోర్డు భూమి సర్వే నెంబరు 154లో 12 ఎకరాల 49 సెంట్ల స్థలం ఉందన్నారు. ఇందులో ఇప్పటికే 7 ఎకరాలు అన్యాక్రాంతమైందన్నారు. ఉన్న 5 ఎకరాలు కొంతమంది రియల్ ఎస్టేట్ వ్యాపారులు కబ్జా చేశారన్నారు. కార్యక్రమంలో సహాయ కార్యదర్శి డి.శ్రీనివాసరావు, ఇన్సాఫ్ జిల్లా నాయకులు అన్వర్ బాషా, నాగరాజు, గిడ్డమ్మ పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**కర్నూలు అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** రాష్ట్రం వ్యాప్తంగా పెండిం గ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అబ్దుల్లా డిమాండ్ చేశారు. గురువారం రాయలసీమ యూనివర్సిటీలో కో కన్వీనర్ రామక్రిష్ణ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి పీజీ పరీక్షను రద్దు చేయాలని ఈనెల 15న విజయవాడలో దీక్ష చేపడుతు న్నామని తెలిపారు. కార్యక్రమంలో మౌలాలి, దివాకర్, కృపాకర్, శివ, నారాయణ, ఆశోక్, చిన్న, ప్రకాష్, ప్రతాప్ సూర్య, అవినాష్ పాల్గొన్నారు.

## మౌలిక వసతుల కల్పనే లక్ష్యం: మేయర్

**కర్నూలు న్యూసిటీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** నగరంలో మౌలిక వసతుల కల్పనే తమ లక్ష్యమనిమేయర్ బీవై.రామయ్య అన్నారు. గురువారం నగర పాలక కార్యాలయంలో స్థాయి సంఘ సమావేశం నిర్వహించారు. 10 తీర్మానాలను, రూ.2.06 కోట్ల నిధుల వినియోగానికి పచ్చజెండా ఊపారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ నగరంలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీటవేస్తూ ప్రాధాన్యత క్రమంలో నిధు లు కేటాయిస్తున్నామన్నారు. సభ్యులు లేవనెత్తిన పారిశుధ్య సమస్యలను పరిష్కరిస్తామన్నారు. ఈసమావేశంలో కమిషనర్ రవీంద్ర బాబు, సభ్యులు విక్రమసింహారెడ్డి, యూనుస్, క్రాంతికుమార్, జుబేర్, మేనేజర్ చిన్నరాముడు, ఆరోగ్య అదికారి కె.విశ్వేశ్వరరెడ్డి, ఎస్ఈ రాజశేఖర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, ఆర్ఓ ఇజ్రాయేలు, టీపీఆర్ఓ వెంకటలక్ష్మి, అకౌం ట్స్ ఆఫీసర్ చండీప్రసాద్ పాల్గొన్నారు.

# రాజకీయ పార్టీల సలహాలను పరిగణనలోకి తీసుకుంటాం

### కర్నూలు నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి రవీంద్రబాబు


మాట్లాడుతున్న రవీంద్రబాబు

**కర్నూలు న్యూసిటీ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):** రాజకీయ పార్టీలు తెలిపే సలహాలు, సూచనలు, అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని కర్నూలు నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కార్పొరేషన్ కమిషనర్ ఎస్.రవీంద్రబాబు అన్నారు. గురువారం నగర పాలక కార్యాలయంలో రాజకీయ పార్టీల ప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి నెలా మొదటి వారంలో రాజకీయ ప్రతినిధుల సమావేశం జరుగుతుందన్నారు. సమావేశంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు ఇచ్చే సలహాలు, సూచనలు, అభ్యంతరాలను పరిశీలించి ఎన్నికల సంఘం దృష్టికి తీసుకెళ్తామన్నారు. సమావేశంలో ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులు పలు సమస్యలను లేవనెత్తారు. జొహరాపురం సమీపంలోని ఇందిరమ్మ కాలనీలో పోలింగ్ కేంద్రం లేక జొహరాపురం 257, 258వ పోలింగ్ కేంద్రాలకు వెళ్లాల్సి వస్తుందని, వాటిని దృష్టిలో ఉంచుకుని ఇందిరమ్మ కాలనీలో పోలింగ్ కేంద్రం ఏర్పాటు చేయాలని టీడీపీ, వైసీపీ, కాంగ్రెస్, సీపీఎం ఇతర పార్టీల ప్రతినిధులు ఆర్వో దృష్టికి తీసుకెళ్లారు. ఓటర్ల జాబితాలో చిరునామా, నగర పాలక ఇంటి నెంబర్లు కొత్తవి గందరగోళంగా ఉందని తెలిపారు. ఈ సమావేశంలో తహసీల్దార్ వెంకటలక్ష్మి, డిటీ డబ్లూ ధనుంజయ్, సూపరింటెండెంట్లు సుబ్బన్న పాల్గొన్నారు.

## తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలి


మాట్లాడుతున్న ఎంపీడీవో శివనాగ ప్రసాద్

**గూడూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** వేసవిలో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూడాలని ఎంపీడీవో శివనాగ ప్రసాద్ అన్నారు. గురువారం గూడూరు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో ఆధ్వర్యంలో వేసవిలో తాగునీటి ఎద్దడిని ఎలా ఎదుర్కోవాలన్న అంశంపై ఆయా గ్రామాల సర్పంచులు, పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీవో మాట్లా డుతూ కుంటలను సుంకేసుల డ్యాం, ఎల్లెల్సీ నీటి ద్వారా నింపుకోవాలని సూచిం చారు. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి సబీహా పర్వీన్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ సనా పాల్గొన్నారు.

## పదిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

**ఓర్వకల్లు, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** పదో తరగతిలో ప్రతి విద్యార్థి వంద ఉత్తీర్ణత సాధించాలని ప్రధానోపాధ్యాయులు ప్రేమ్ కుమార్ అన్నారు. గురువారం మండలంలోని హుశేనాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు పరీక్షా సామాగ్రిని అందజేశారు. హెచ్ఎం ప్రేమ్‌కుమార్ తన సొంత నిధులతో పరీక్షా సామాగ్రిని అందజేశారు. కార్యక్ర మంలో ఉపాధ్యాయులు గౌరు నందనరెడ్డి, మద్దిలేటి స్వామి, లలిత కుమారి, సుధారాణి, లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

## ఆ మురుగు నీటితో రోగాలు

**కర్నూలు న్యూసిటీ, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** దూపాడు గ్రామంలోని అశోక్ ఉమెన్స్ కళాశాల నుంచి బయటికి వచ్చే మురుగు నీటితో ప్రజలు రోగాల బారిన పడుతున్నారని సీపీఎం సీనియర్ నాయకుడు జి.రామక్రిష్ణ అన్నారు. గురువారం నగర పాలక కార్యాలయంలో కమిషనర్ రవీంద్రబాబును కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అశోక్ ఉమెన్స్, కేవీ సుబ్బారెడ్డి ఇంజనీరింగ్ కళాశాలల మురుగునీరు అంతా దూపాడు గ్రామంలోని రింగుబావిలోకి వదులుతున్నారని అన్నారు. గ్రామ పెద్దలు నారాయణ, వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

## మొక్కలు నాటి.. పర్యావరణాన్ని పరిరక్షించండి

**ఓర్వకల్లు, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించాలని జిల్లా అటవీ శాఖ అధికారి శ్యామల అన్నారు. గురువారం నన్నూరు సమీపంలో మేక్ ది డిఫరెన్స్ స్వచ్ఛంద సంస్థతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా డీఎఫ్‌వో శ్యామల హాజరై మాట్లాడారు. చెట్లు మన జీవనంలో కీలకపాత్ర పోషిస్తున్నాయన్నారు. ఆర్‌వీపీఎల్ ప్రాజెక్టు హెడ్ మధు మోహన్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడే బాధ్యత మనందరిపై ఉందన్నారు. కార్యక్రమంలో ఆర్‌వీపీఎల్ సంస్థ ఉద్యోగులు, పెట్రోలింగ్ అంబులెన్సు సిబ్బంది పాల్గొన్నారు.


మొక్క నాటుతున్న అధికారులు

## దేవతలారా రండి..!


దేవతలను ఆహ్వానిస్తూ భేరిపూజ చేస్తున్న అర్చకులు

**కోడుమూరు రూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** మండలంలోని గోరంట్లలో వెలసిన లక్ష్మీమాధవుడి పరిణయానికి దేవతలను ఆహ్వానిస్తూ అర్చకులు పూజా క్రతువులను నిర్వహించారు. స్వామి అమ్మవార్ల బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని గురువారం మధ్యాహ్నం ధ్వజస్తంభానికి గరుత్మంతుడిని చిత్రించిన శ్వేతవర్ణ వస్త్రం, దర్భను అలంకరించి ధ్వజారోహణ గావించారు. సాయంత్రం లక్ష్మీమాధవస్వామి పెళ్లికి దేవతలను ఆహ్వానిస్తూ భేరిపూజ చేపట్టారు. రాత్రి ఉత్సవ మూర్తులను అలంకరించి మేళతాళాల మధ్యన సింహవాహనంపై ఊరేగించారు. వేడుకను తిలకించడానికి గ్రామస్థులు పెద్దఎత్తున తరలివచ్చారు. ఈ కార్యక్రమంలో వేద పండితుడు వందవాసి రాధాక్రిష్ణ, అర్చకులు పురుషోత్తం, రమణ, హరి, రాజేష్, రంగస్వామి పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే దస్తగిరి జన్మదిన వేడుకలు


తిక్కారెడ్డికి కేక్ తినిపిస్తున్న టీడీపీ నాయకులు

**కర్నూలు అర్బన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో కోడుమూరు ఎమ్మెల్యే బొగ్గుల దస్తగిరి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం సాయంత్రం టీడీపీ జిల్లా అధ్యక్షుడు తిక్కారెడ్డి, రాష్ట్ర కార్యదర్శి పై నాగేశ్వరరావు యాదవ్‌లతో నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మాదిగ కార్పొరేషన్ డైరెక్టర్ డి.జేమ్స్, బీసీ జిల్లా అధ్యక్షుడు సత్రం రామక్రిష్ణుడు, రెడ్డి పోగు బజా రన్న, చిప్పగిరి మీనాక్షి నాయుడు, షేక్షా, రాజశేఖర్ పాల్గొన్నారు.


## దర్గాకు రోడ్డు వేయండి

**ఓర్వకల్లు మార్చి 13(ఆంధ్రజ్యోతి):** స్థానిక బైరెడ్డి కాలనీలో వెనుక భాగాన ఉన్న అల్లాబకాష్ మీరా దర్గాకు రోడ్డు వేయాలని గురువారం సీపీఐ నాయకులు రమేష్, సుధాకర్‌లు ఎంపీడీవో శ్రీనివాసులుకు వినతి పత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ దర్గాను దర్శించుకునేందుకు భక్తులు వెళ్తుంటారని, రోడ్డు లేకపోవడంతో భక్తులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. అధికారులు స్పందించి రోడ్డు వేయాలని కోరారు.


ఎంపీడీవోకు వినతి పత్రం ఇస్తున్న నాయకులు

# అసెంబ్లీలో గుండ్రేవుల..

గుండ్రేవుల జలాశయంపై శాసనసభలో గురువారం పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత గళమెత్తారు. తుంగభద్ర నదిపై 20 టీఎంసీల సామర్థ్యంలో గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మించి కేసీ కాలువ ఆయకట్టు రైతులను ఆదుకోవాలని ఎన్నో ఏళ్లుగా డిమాండ్ ఉందని అన్నారు. ఈ సందర్భంగా గుండ్రేవుల ప్రాజెక్టు చేపట్టి కేసీ రైతులను, కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతం ప్రజలను ఆదుకుంటామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు అసెంబ్లీ సాక్షిగా స్పష్టమైన హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా గుండ్రేవుల గురించిన వివరాలు ఇలా..


తుంగభద్ర నదిపై గుండ్రేవుల ప్రాజెక్టుకు ప్రతిపాదిత ప్రదేశం

కర్నూలు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు, నంద్యాల, కడప జిల్లాల్లో కర్నూలు-కడప (కేసీ) కాలువ కింద 2.65 లక్షల ఎకరాల ఆయకట్టు ఉంది. కేడబ్ల్యూడీటీ-1 (బచావత్ అవార్డు) మేరకు 31.90 టీఎంసీల నీటివాటా ఉన్నా.. కేసీ కాలువ ఆయకట్టు రైతులకు కన్నీళ్లు తప్పడం లేదు. వేసవిలో కర్నూలు నగర ప్రజలు తీవ్ర తాగునీటి ఎద్దడితో తల్లడిల్లాల్సి వస్తుంది. సుంకేసుల బ్యారేజీ ఎగువన 20 టీఎంసీల సామర్థ్యంతో గుండ్రేవుల జలాశయం నిర్మిస్తే.. కేసీ ఆయకట్టుకు సాగు, కర్నూలు నగరానికి తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని సాగునీటి నిపుణుడు, రిటైర్డ్ ఈఈ సుబ్బరాయుడు విజ్ఞప్తి మేరకు ఉమ్మడి ఏపీ చివరి సీఎం కిరణ్‌కుమార్‌రెడ్డి సర్వేకు రూ.54.95 లక్షలు నిధులు ఇచ్చారు. ఆర్వే అసోసియేట్స్ సంస్థ సర్వే చేసి రూ.2,890 కోట్లతో ప్రభుత్వానికి డీపీఆర్ ఇచ్చింది. 2019 ఫిబ్రవరి 21న నాటి సీఎం చంద్రబాబు రూ.2,890 కోట్లు మంజూరు చేశారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఐదేళ్లు ఒక్కపైసా కూడా నిధులు ఇవ్వకపోగా.. అంతర్ రాష్ట్ర సమస్య అంటూ పెండింగ్ ఫైళ్ల జాబితాలో పడేసింది. పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత విన్నపం మేరకు స్పీకర్ అయ్యన్నపాత్రుడు 802వ ప్రశ్నగా అవకాశం ఇవ్వడంతో ఆమె గుండ్రేవుల గురించి మాట్లాడారు.

- ప్రాజెక్టు ప్రాధాన్యతపై మాట్లాడిన ఎమ్మెల్యే గౌరు చరిత
- సీఈ కబీర్‌బాషాతో ఇరిగేషన్ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సాయిప్రసాద్ సమీక్ష


అసెంబ్లీలో మాట్లాడుతున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

### కరువు రైతుల జీవనాడి గుండ్రేవులు

గుండ్రేవుల ప్రాజెక్టు కరువు సీమ రైతుల జీవనాడి అని శాసనసభలో పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత అన్నారు. కేసీ కాలువ కింద 2.65 లక్షల ఎకరాలు ఆయకట్టు ఉందని, తుంగభద్ర డ్యాం నుంచి సక్రమంగా నీరు అందడం లేదన్నారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ ద్వారా తీసుకుందామంటే కేఆర్ఎంబీలో తెలంగాణ అభ్యంతరం చెబుతుందని వివరించారు. 2019లో నాటి సీఎం చంద్రబాబు రూ.2,890 కోట్లతో తుంగభద్రపై గుండ్రేవుల నిర్మాణానికి పరిపాలన అనుమతులు ఇచ్చి టెండర్లు కూడా పిలిస్తే.. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండర్లు అంటూ రద్దు చేసిందని, రైతుల నుంచి తీవ్ర వ్యతిరేకత రావడంతో ప్రాధాన్యత ప్రాజెక్టుల జాబితాలో చేరుస్తామని చెప్పి ఐదేళ్లలో ఒక్కపైసా కూడా ఇవ్వకుండా తీరని అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు.

### గుండ్రేవుల చేపడుతాం.. కేసీని ఆదుకుంటాం

గుండ్రేవుల ప్రాజెక్టును చేపట్టి కేసీ రైతులు, కర్నూలు జిల్లా పశ్చిమ ప్రాంతాన్ని ఆదుకుంటామని జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు ఎమ్మెల్యే గౌరు చరిత ప్రశ్నకు సమాధానంగా స్పష్టం చేశారు. సుంకేసులు ఎగువన గుండ్రేవుల రిజర్వాయర్ నిర్మిస్తే.. వెనుకబడిన రాయలసీమ ప్రాంతానికి ప్రయోజనం కల్పించాలని గుండ్రేవులకు అంకుర్పారణ చేశారు. 2013లో డీపీఆర్ తయారు చేయమని రూ.54.95 లక్షలు ప్రభుత్వం సర్వేకి నిధులు ఇచ్చింది. సర్వే చేసిన ఆర్వే అసోసియేట్స్ సంస్థ డీపీఆర్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు నిర్మాణంలో కర్నూలు జిల్లాలో 11 గ్రామాలు, తెలంగాణలో 5 గ్రామాలు ముంపుకు గురవుతున్నాయి. రాష్ట్రం విడిపోవడంతో తెలంగాణ రాష్ట్రం సమ్మతి కూడా అవసరం ఉంది. 2019లో కేఆర్ఎంబీ ద్వారా తెలంగాణ సమ్మతి తీసుకొని ప్రాజెక్టు కట్టాలని నాటి సీఎం చంద్రబాబు రూ.2,890 కోట్లు ఇచ్చారు. దురదృష్టం కొద్ది జగన్ ప్రభుత్వం రావడంతో ఐదేళ్లలో ఒక్కపైసా కూడా ఖర్చు చేయలేదు. తెలంగాణ అనుమతి కోసం కేఆర్ఎంబీకి లేఖలు రాలేదు. గత టీడీపీ ప్రభుత్వంలో రాయలసీమ ప్రాజెక్టులకు వెచ్చించిన బడ్జెట్ రూ.12 వేలు కోట్లు కాగా సీమ బిడ్డ అని చెప్పుకునే జగన్ ఐదేళ్లలో పెట్టిన బడ్జెట్ రూ.3,500 కోట్లే. సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ సూచనల మేరకు గుండ్రేవుల ప్రాజెక్టు నిర్మాణానికి రూ.4,530 కోట్లు అవసరమని అంచనాలే వేశామని, విడతల వారిగా నిధులు ఇచ్చి చేపడుతామని మంత్రి నిమ్మల రామానాయుడు అసెంబ్లీలో హామీ ఇచ్చారు. అనంతరం జలవనరుల శాఖ స్పెషల్ చీఫ్ సెక్రెటరీ సాయిప్రసాద్ ప్రాజెక్టుపై ఉమ్మడి కర్నూలు జిల్లా ప్రాజెక్ట్స్ సీఈ కబీర్‌బాషా, కేసీ కెనాల్ ఈఈ ప్రతాప్‌లతో సమీక్షించారు.

## హంద్రీలో పచ్చదనం..!

- చెత్తతో నదిని పూడ్చేసిన నగర పాలక సంస్థ
- కబ్జాకు అక్రమార్కుల ఎత్తులు
- మంత్రి టీజీ భరత్ ఆగ్రహం
- పూడ్చిన నదిలో పచ్చదనం కోసం సన్నాహాలు


హంద్రీ నదిని చెత్తతో పూడ్చేసిన నగరపాలక సంస్థ సిబ్బంది

కర్నూలు, ఫిబ్రవరి 13 (ఆంధ్రజ్యోతి): నగర నడిబొడ్డున హంద్రీ పరివాహక ప్రాంతంలో ఆనంద్ థియేటర్ వద్ద చెత్తతో పూడ్చివేసిన చోట కేఎంసీ అధికారులు పచ్చదనం పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. ఆర్టీసీ బస్టాండ్ వైపు నుంచి కలెక్టరేట్, ప్రభుత్వ సర్వజన వైద్యశాలకు వెళ్లే ప్రజలకు ట్రాఫిక్ సమస్య లేకుండా ఆనంద్ థియేటర్‌కు ఎదురుగా నదిపై కాజ్‌వే (వంతెన) ఉంది. దాని పక్కనే హంద్రీ ఒడ్డున కేఈ మాదన్న నగర్ కాలనీ ఉంది. కర్నూలు మున్సిపల్ కార్పొరేషన్ (కేఎంసీ) అధికారుల ఆదేశాల మేరకు పారిశుధ్య సిబ్బంది నగరంలో సేకరించిన చెత్త, మట్టిని కాజ్‌వే పక్కనే వేస్తూ.. నదిని పూడ్చేస్తూ వచ్చారు. దీనిపై గతంలోనే జలవనరుల శాఖ అధికారులు అభ్యంతరం వ్యక్తం చేశారు. అయినా.. నగరపాలక పారిశుధ్య సిబ్బందిలో మార్పు రాలేదు. అయితే.. కార్పొరేషన్ పారిశుధ్య సిబ్బంది చెత్త, మట్టితో పూడ్చేసిన హంద్రీ నదిని కబ్జాకు కొందరు ప్రయత్నించారు. విషయం తెలిసిన రాష్ట్ర పరిశ్రమలు, వాణిజ్య, ఆహారశుద్ధి మంత్రి టీజీ భరత్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసినట్లు సమాచారం. హంద్రీ నది కబ్జాకు గురికాకుండా చర్యలు చేపట్టాలని కార్పొరేషన్ కమిషనర్ ఎస్. రవీంద్రబాబును ఆదేశించినట్లు సమాచారం. ఎట్టకేలకు మేలొన్న కేఎంసీ అధికారులు నదిని పూడ్చిన ప్రదేశంలో పచ్చదనం, పరిశుభ్రత పనులకు శ్రీకారం చుట్టారు. దాదాపు రూ.8 లక్షలతో సిమెంట్ స్తంభాలు, కంచె ఏర్పాటుతో పాటు పచ్చదనం కోసం వివిధ మొక్కలు నాటేందుకు సన్నాహాలు చేస్తున్నారు. ఇప్పటికే కంచె ఏర్పాటుకు సిమెంట్ పోల్స్ నాటారు. అయితే... హంద్రీ నది ప్రక్షాళన, ఆక్రమణలకు గురి కాకుండా సంరక్షణ చర్యలు చేపట్టాల్సిన ప్రభుత్వ అధికారులే హంద్రీ ఒడ్డున ఓ ప్రణాళిక ప్రకారం పూడ్చేయడం విమర్శలకు తావిస్తుంది. దీనిపై జలవనరుల శాఖ ఎఫ్ఆర్ఎల్ డివిజన్ డీఈఈ రామకృష్ణ దృష్టికి ఆంధ్రజ్యోతి తీసుకెళ్లగా హంద్రీ నది సంరక్షణలో భాగంగా సరిహద్దులు గుర్తించేందుకు త్వరలో సర్వే చేయబోతున్నామన్నారు. ఇప్పటికే సరిహద్దు రాళ్లను సిద్ధం చేశామన్నారు.


హంద్రీ నది

## అలరించిన అవధానం


అష్టావధానంలో పాల్గొన్న పృశ్చికులను సత్కరిస్తున్న దృశ్యం

కర్నూలు రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కర్నూలు నగర శివారులోని మిలటరీ కాలనీలో ఉన్న జడ్పీ ప్రభుత్వ పాఠశాలలో గురువారం జరిగిన అష్టావ ధానం ఆద్యంతం ఆకట్టుకుంది. వర్ధమాన అవధాని, దంత వైద్యుడు డాక్టర్ బొరెల్లి హర్ష నిర్వహించిన ఈ అవధాన కార్యక్రమంలో పండితులతో పాటు విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కర్నూలు ఉప విద్యాశాఖ అధికారి ఎన్.హనుమతరావు హాజరయ్యారు. పాఠశాల ప్రధానోపాధ్యా యురాలు సి. రాజేశ్వ రమ్మ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా డిప్యూటీ డీఈఓ హనుమంతరావు మాట్లాడుతూ అవధాన ప్రక్రియ తెలుగు భాషలో ప్రత్యేకంగా నిలుస్తుందని చెప్పారు. కాగా ఈ అష్టావధాన కార్య క్రమంలో సుధాకర శర్మ (నిషిద్ధాక్షరి), ప్రముఖ కవి తొగట సురేష్‌బాబు (సమస్య), నంది నాటక న్యాయ నిర్ణేత, రిటైర్డ్ హెచ్ఎం యర్రమ పాండురంగయ్య (పురాణ పఠనం), కవయిత్రి డాక్టర్ కర్నాటి చంద్రమౌళిని (వర్ణన), శతకకర్త వరలక్ష్మీ (న్యస్తాక్షరి), తెలుగు పండితుడు దేవవరం (ఆశువు), తెలుగు పండితుడు పి.రాఘవయ్య (యాం త్రిక గణనం), పాఠశాల ఉపాధ్యా యుడు శ్రీనివాసులు (అప్రస్తుత ప్రసంగం)లతో ఈ అష్టావధానం కొనసాగింది. అనంతరం అవధాని బొరెల్లి హర్షతో పాటు కవులు, తెలుగు పండితులను ఘనంగా సత్కరించారు.

## బడి బాగుండాలని..!

(5వ పేజీ తరువాయి)

కోడుమూరు మండలం కలపరి జడ్పీ ఉన్నత పాఠశాలలో 3 నుంచి 10వ తరగతి వరకు 179 మంది విద్యార్థులు చదువుతున్నారు. 9 అదనపు తరగతి గదులు మంజూరు చేస్తే.. ఐదు గదులు నిర్మాణం దాదాపుగా పూర్తి చేశారు. రంగులు, విద్యుత్ పరికరాలు, కిటికీలు పనులు చేయాలి. గత ప్రభుత్వం నిధులు ఇవ్వకపోవడంతో పనులు ఆగిపోయాయి. ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలలో అరకొర సౌకర్యాల మధ్య కొనసాగిస్తున్నారు.

**మన బడి-మన భవిష్యత్తు ఫేజ్-2 వివరాలు:**

| | |
|---|---|
| ఎంపిక చేసిన విద్యాలయాలు | 1,074 |
| మంజూరు వివిధ పనులు | 1,746 |
| అదనపు తరగతి గదులు | 311 పాఠశాలలు, 1,311 గదులు |
| ప్రహరీలు | 367 పాఠశాలలు |
| అంచనా విలువ | రూ.520 కోట్లు |
| చేసిన ఖర్చు | రూ.276 కోట్లు |
| తాజాగా ఇచ్చిన నిధులు | రూ.29.83 కోట్లు |

- గూడూరు మండలంలో 31 పాఠశాలలకు గత వైసీపీ హయాంలో నాడు-నేడు కింద అదనపు తరగతి గదులు, తాగునీరు, మరుగుదొడ్లు, మైనర్ రిపేరి వంటి పనులు మంజూరు చేశారు. నిధులు లేకపోవడంతో జులకల్లు, మునగాల, వై.ఖానాపురం, బూడిదపాడు, చనుగొండ్ల, పెంచికలపాడు, పొన్నకల్ గ్రామాల్లో అదనపు తరగతి గదులు అసంపూర్తిగా ఆగిపోయాయి.
- జిల్లాలో వైసీపీ హయాంలో నాడు-నేడు కింద పాఠశాలల్లో చేపట్టిన వివిధ నిర్మాణాల పరిస్థితి ఇదాలు ఇలాగే ఉంది. టీడీపీ కూటమి ప్రభుత్వం 'మన బడి-మన భవిష్యత్తు' ఫేజ్-2 కింద తొలి విడతగా రూ.29.83 కోట్లు మంజూరు చేయడంతో 2025-26 విద్యా సంవత్సరం ప్రారంభం నాటికి అసంపూర్తి పనులు పూర్తి చేసి బడులు పునఃప్రారంభం నాటికి విద్యార్థులు మెరుగైన సౌకర్యాలు కల్పించనున్నారు.

**జిల్లాకు రూ.29.83 కోట్లు:**

టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాక మన బడి-మన భవిష్యత్తు ఫేజ్-2 కింద రాష్ట్రంలో 22,344 పాఠశాలలు, ఇతర విద్యా సంస్థల్లో రూ.8 వేల కోట్లలో మౌలిక వసతుల కల్పన పరిపాలన అనుమతులు మంజూరు చేశారు. అందులో తొలి విడతగా 407.91 కోట్లు మంజూరు చేస్తూ ప్రభుత్వ ఉత్తర్వులు జారీ చేసింది. అందులో అత్యధికంగా కర్నూలు జిల్లాకు రూ.29.83 కోట్లు, నంద్యాల జిల్లాకు 11.71 కోట్లు కేటాయించారు. నిధులు రావడంతో ప్రభుత్వ బడులకు మహర్దశ రానుందని విద్యార్థులు, ఉపాధ్యాయులు పేర్కొంటున్నారు.


దేవనకొండ మండలం కరివేముల గ్రామంలో అసంపూర్తిగా ఆగిపోయిన జడ్పీ ఉన్నత పాఠశాల అదనపు తరగతి గదుల నిర్మాణాలు


కోడుమూరు మండలం కలపరి జడ్పీ ఉన్నత పాఠశాల దుస్థితి ఇది

### అప్పుల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

తుగ్గలి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఏటా సాగు చేసిన పంటలు అప్పులే మిగులుస్తుండటంతో బుధవారం అర్ధరాత్రి పుండుకూర రామాంజనేయులు (45) అనే రైతు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన మండల పరిధిలోని మారెళ్లలో జరిగింది. రైతు తనకున్న ఎకరా పొలంతో పాటు మరో పదెకరాలు కౌలుకు తీసుకుని వేరుశనగ, కంది, టమోటా పంటలు సాగు చేశారు. ఏటా సాగు ఖర్చు కూడా తిరిగి రావడం లేదు. దాదాపు రూ.15 లక్షల మేర అప్పులు అయ్యాయి. అప్పులు ఎలా తీర్చాలో తెలియక రామాంజనేయులు ఉరేసుకున్నాడు. కుటుంబ సభ్యులు నిద్రలేచి చూడగా.. ఉరితాడుకు వేలాడుతూ రామాంజనేయులు కనిపించాడు. వాళ్లు హడావిడిగా పత్తికొండ ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అప్పటికే ఆయన మృతి చెందినట్లు రైతులు ధృవీకరించారు. మృతునికి భార్య మహేశ్వరమ్మ, ఒక కుమారుడు ఉన్నారు. మహేశ్వరమ్మ ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తుగ్గలి ఎస్ఐ కృష్ణమూర్తి తెలిపారు.

### హత్యాయత్నం కేసులో ఇద్దరికి ఏడేళ్ల జైలు

పాణ్యం, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని తమ్మరాజుపల్లెకు చెందిన ఎం. శివమ్మపై జరిగిన హత్యాయత్నం కేసులో బేతంచెర్లకు చెందిన సందోలి అంజి, మాదిగ హరినాథ్‌కు నంద్యాల ప్రిన్సిపల్ అసిస్టెంట్ సెషన్ న్యాయాధికారి రాధారాణి ఏడేళ్ల జైలు శిక్ష, రూ. 11 వేలు జరిమానా విధించినట్లు పాణ్యం ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ తమ్మరాజుపల్లె గ్రామానికి చెందిన శివమ్మ తన కోడలు, నిందితుల్లో ఒకరు సన్నిహితంగా ఉంటున్నారని కోడలిని నిత్యం వేధించేవారు. దీంతో శివమ్మ కోడలు విజయలక్ష్మి నలుగురు వ్యక్తులతో కలిసి 2017 ఏప్రిల్ 5వ తేదీన రాత్రి 11.20 గంటలకు శివమ్మపై కత్తులతో దాడి చేశారు. ఆమె చనిపోయిందని అక్కడి నుంచి వెళ్లిపోయారు. అయితే కొన ఊపిరితో ఉన్న శివమ్మను ఆసుపత్రికి తరలించారు. ఆమె ప్రాణాలతో భయటపడ్డారు. దీంతో శివమ్మ ఫిర్యాదు మేరకు అప్పటి పాణ్యం ఎస్ఐ చిరంజీవి శివమ్మ కోడలు విజయలక్ష్మి, బేతంచెర్లకు చెందిన అంజి, హరినాథ్, కర్నూలుకు చెందిన చెన్నకేశవులు, మగ్బూల్ బాషాపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అయితే వీరిలో ముగ్గురు చనిపోగా.. మిగిలిన ఇద్దరిని విచారించి కేసు రుజువైనందున శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చారని చెప్పారు.

### రూ.1.5 కోట్లకు చిరు వ్యాపారి ఐపీ

ఎమ్మిగనూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని మసీదుపురం గ్రామంలో ఓ చిరు వ్యాపారి ఏకంగా రూ. కోటిన్నరకు ఐపీ పెట్టిన ఘటన ఆలస్యంగా వెలుగు చూసింది. వివరాలివీ.. గ్రామంలో కొంతకాలంగా ఓ దుకాణాన్ని నడుపుతూ జీవనం సాగిస్తున్న వ్యాపారి గ్రామంతో పాటు చుట్టు ముట్టు గ్రామాల్లోని రైతులు, వ్యవసాయ కూలీలతో పాటు ఇతరుకు వడ్డీ ఆశచూపి ఒకరి తెలియకుండా మరొకరి దగ్గర ఇలా దాదాపు 60నుంచి 70 మంది దగ్గర రూ. కోటిన్నర మేరకు అప్పు తీసుకున్నాడు. అయితే తీసుకున్న డబ్బును తిరిగి చెల్లించకుండా సాకులు చెప్పుకుంటూ రోజులు గడిపాడు. అయితే అప్పులు ఇచ్చిన వారందరికీ ఐపీ నోటీసులు ఇచ్చాడు. ఐపీ నోటీసులు రావటంతో అప్పు ఇచ్చిన వారంతా లబోదిబోమంటున్నారు.

### విద్యుత్ తీగలు తాకి రైతు మృతి

పాములపాడు, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మొక్కజొన్న పంట కోత కోసేందుకు కోత మిషన్‌పై వెళ్తూ విద్యుత్ తీగలు తగిలి రైతు కామేశ్వరరావు (48) మృతి చెందారు. వివరాలివీ.. క్రిష్ణానగర్ గ్రామానికి చెందిన రైతు కామేశ్వరరావు గురువారం రాత్రి సుమారు ఎనిమిది గంటల ప్రాంతంలో గ్రామ శివార్లలోని వేంపెంట పొలిమేరలో తన మొక్కజొన్న పంట కోయించేందుకు కోతమిషన్‌పై బయలుదేరారు. అయితే మార్గమధ్యంలో విద్యుత్ తీగలు తగిలి మృతి చెందారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి విచారణ చేపట్టారు.



## ప్రాజెక్టులపై సమగ్ర నివేదిక ఇవ్వండి

- నీటి విడుదలలో అక్రమాలకు పాల్పడకుండా పర్యవేక్షించాలి
- కలెక్టర్ పి. రంజిత్ బాషా


మాట్లాడుతున్న కలెక్టర్

కర్నూలు కలెక్టరేట్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ప్రస్తుతం ఉన్న ప్రాజెక్టుల వివరాలతో పాటు ప్రతిపాదించిన ప్రాజెక్టులపై సమగ్ర నివేదిక ఇవ్వాలని కలెక్టర్ పి. రంజిత్ బాషా జలవనరుల శాఖ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాల్లో జిల్లాలోని నీటి పారుదల ప్రాజెక్టుల పరిస్థితిపై కలెక్టర్ జలవనరుల శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ పందికోన రిజర్వాయరు ద్వారా మరింత ఆయకట్టుకు నీరందించేందుకు వీలుగా రిజర్వాయరుకు సంబంధించి మిగిలిపోయిన పనులను పూర్తి చేసేందుకు రూ.210 కోట్లుతో రూపొందించిన ఎస్టిమేట్స్‌ను త్వరితగతిన ప్రభుత్వానికి పంపించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో జరుగుతున్న హంద్రీనీవా విస్తరణ పనులకు ప్రభుత్వం నిర్దేశించిన విధంగా ఈ ఏడాది జూన్‌లోపు పూర్తి చేయాలన్నారు. హంద్రీనీవా ద్వారా 68 ట్యాంకులను నింపడంలో భాగంగా జిల్లాలో ఉన్న 39 చెరువులకు గాను ఇప్పటి వరకు 33 చెరువులకు నీరు నింపారని, మిగిలిన ట్యాంకులను కూడా త్వరితగతిన నింపాలని అన్నారు. 33 చెరువులు ఫుల్‌గా నింపారా? అని కలెక్టర్ అధికారులను ఆరా తీశారు. 23 ట్యాంకులను ఫుల్‌గా నింపాలని, 10 ట్యాంకులను పాక్షికంగా నీరు నింపామని అధికారులు తెలుపగా.. పూర్తి వివరాలు తనకు అందజేయాలన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ చల్లా కళ్యాణి, జలవనరుల శాఖ ఎస్ఈ ద్వారకనాథ్ రెడ్డి, హంద్రీనీవా ఈఈ చంద్రశేఖర్ రెడ్డి, ఈఈలు, డీఈలుశైలేష్, రామకృష్ణ, విజయకుమార్ పాల్గొన్నారు.

## గృహాలు నిర్మించుకునే వారికి శుభవార్త

మద్దికెర, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): స్థలాలు ఉండి పక్కాగృహాలు నిర్మించుకునే పేదలకు ప్రభుత్వం శుభవార్త తెలిపిందని హౌసింగ్ ఏఈ ఉమాకాంత్ తెలిపారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు రూ.1.80 లక్షలు ఇస్తాయని, అయితే రాష్ట్ర ప్రభుత్వం ఎస్‌సీ‌డీసీ, మైనార్టీలకు అదనంగా రూ.50వేలు ఇవ్వడంతో ఒక్కక్క పక్కా గృహానికి రూ.2.30 లక్షల వరకు వస్తుందన్నారు. ఎస్సీ, ఎస్టీలకు రూ.75వేలు కలపడంతో ఒక్కో పక్కా గృహానికి రూ.2.55లక్షల వరకు వస్తుందన్నారు. సచివాలయాల్లో దరఖాస్తు చేసుకోవాలన్నారు.

## చెత్తతో సంపద సృష్టించాలి

హొళగుంద, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): చెత్త సేకరణతో సంపదను సృష్టించాలని ఆదోని డీఎల్‌పీవో నూర్జహాన్, ఎంపీడీవో విజయ లలిత సూచించారు. గురువారం మేజర్ పంచాయతీ సర్పంచ్ చలువాది రంగమ్మ అధ్యక్షతన డంపింగ్ యార్డ్ వద్ద హొళగుంద, హాలహర్వి మండలాల పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ నిర్వహించారు. తడి, పొడి చెత్తను వేరుచేసి ఆ వ్యర్థాల నుంచి ఎరువు తయారు చేసి విక్రయించాలన్నారు. దీంతో గ్రామాల్లో పరిశుభ్రత వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఈవోఆర్డీలు చక్రవర్తి రామాంజినేయులు, కార్యదర్శులు రాజశేఖర్ గౌడ్, రంగస్వామి, కురువ నాగరాజు, షఫీ, ఉమా మహేశ్వరీ, నాగరాజు, నిరంజన్, మంజునాథ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న డీఎల్‌పీవో నూర్జహాన్

## 21న గ్రామ పంచాయతీ వేలాలు

వెల్దుర్తి, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మేజర్ గ్రామపంచాయతీక వేలాలను ఈ నెల 21న నిర్వహిస్తున్నట్లు పంచాయతీ సెక్రటరీ లక్ష్మీనాథ్ గురువారం తెలిపారు. 2025-26 సంవత్సరానికి వారపు సంత మార్కెట్, కూరగాయల మార్కెట్, పార్కింగ్ ఫీజు, జంతు వధశాల, మాంసపు అంగళ్లు, సంత మార్కెట్ దుకాణాలు, ఈనెల 21వ తేదీన డీఎల్‌పీవో లక్ష్మీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు వివరాలకు పంచాయతీ కార్యాలయంలో సంప్రదించాలని కోరారు.

## తప్పులుంటే సరిదిద్దుకోండి


పెండేకల్‌లో ఈక్రాప్ జాబితాతో వ్యవసాయాధికారులు

తుగ్గలి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రబీ ఈక్రాప్ నమోదులో తప్పులు ఉంటే రైతులు సరి చేసుకోవాలని ఏవో పవన్ కుమార్ సూచించారు. గురువారం పెండేకల్, ఎద్దులదొడ్డి గ్రామాల జాబితాను విడుదల చేశారు. 9,626 ఎకరాల్లో 3158 మంది రైతులు ఈ క్రాప్ నమోదు చేసుకున్నారని ఆర్‌బీకే కేంద్రాల్లో ప్రదర్శించామన్నారు. తప్పులుంటే లిఖిత పూర్వక అభ్యంతరాలు తెలియజేయాలని కోరారు. కార్యదర్శి గోపాల్, వీఆర్వో తిమ్మప్ప ఉన్నారు.

## సొంతింటి కల టీడీపీతోనే సాధ్యం

వెల్దుర్తి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పేదోడి సొంతింటి కల సీఎం చంద్రబాబుతోనే సాకారమవుతుందని కన్వీనర్ బలరాంగౌడ్, రమకాంత్‌రెడ్డి అన్నారు. గురువారం పార్టీ కార్యాలయంలో మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం జగనన్న కాలనీల పేరుతో ప్రజలను మభ్యపెట్టిందన్నారు. గతంలో గృహం మంజూరై నిర్మాణం పూర్తికాని ఇళ్లకు సీఎం చంద్రబాబు అదనపు నిధులు మంజూరు చేశారన్నారు. ఎస్సీ, బీసీలకు రూ.50వేలు, ఎస్టీలకు రూ.75వేలు, పీవీటీజీలకు రూ.1లక్ష అదనపు నిధులు మంజూరు చేశారన్నారు.

## రక్త పరీక్షలు ఆసుపత్రిలో చేయాలి

ఆదోని అగ్రికల్చర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో రక్త పరీక్షలకు క్లియ మెథడ్ ఏర్పాటు చేయాలని ఏఐవైఎఫ్ పట్టణ అధ్యక్షుడు లింగప్ప, ఎస్‌ఎఫ్ఐ నాయకుడు శేఖర్ కోరారు. గురువారం సూపరిండెంట్ డాక్టర్ పద్మ కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. డయాలసిస్ రోగుల రక్త పరీక్షలకు ప్రైవేటు ల్యాబ్‌కు పంపుతు న్నారన్నారు. అంజిత్ గౌడ్, రమేష్, వినయ్, వీరేష్ పాల్గొన్నారు.


సూపరిండెంట్‌కు వినతిపత్రం ఇస్తున్న ఏఐఎస్‌ఎఫ్ నాయకులు

## ఉపాధ్యాయుడికి షోకాజ్ నోటీసు

హొళగుంద, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని హన్నూరు గ్రామ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు బి.శివశంకర్ రెడ్డికి షోకాజ్ నోటీసు జారీ చేసినట్లు ఎంఈవోలు జగన్నాథం, సత్యనారాయణ గురువారం తెలిపారు. సదరు ఉపాధ్యాయుడు 05 జూలై 2024 నుంచి అనుమతి లేకుండా విధులకు గైహాజరయ్యారన్నారు. తక్షణమే విద్యాశాఖ అధికారులకు రిపోర్టింగ్ చేయాలని లేనిపక్షంలో శాఖపరమైన చర్యలు తీసుకోవాల్సివస్తుందని అన్నారు.




## బీర.. కరువు తీర

● రూ.50వేల పెట్టుబడితో రూ.1.5లక్షల ఆదాయం


బీర పంటను చూపుతున్న రైతు ఉప్పర సొట్ట రాముడు

దేవనకొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తెర్నేకల్‌కు చెందిన ఉప్పర సొట్ట రాముడు తనకు 1.5 ఎకరాలు ఉండగా, 80 సెంట్లలో బీర సాగు చేశాడు. గతే ఏడాది రూ.50 వేలు పెట్టుబడి పెట్టి సాగుచేయగా 1.5 లక్షల ఆదాయం వచ్చింది. అనంతరం ఈ ఏడాది కూడా బీర సాగు చేయగా కోతలు కోశారు. తాను 600 కర్రలను ఒక్కొక్కటి రూ.70ల ప్రకారం కొనుగుచేశానని, కర్రకు రెండగుడుగుల ఎడం పాటించానన్నాడు. ఇలా కర్రలు పాతి సాగుచేస్తే కాయకు మచ్చల ప్రభావం ఉండదన్నారు.

## టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌కు నేడు భూమి పూజ

పత్తికొండ, మార్చి 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కోతిరాళ్ల గ్రామ పంచాయతీ పరిధిలోని దూదెకొండ గ్రామం వద్ద రూ.11 కోట్లతో ఏర్పాటుచేయనున్న టమోటా ప్రాసెసింగ్ యూనిట్‌కు శుక్రవారం రాష్ట్ర మంత్రి టీజీ భరత్, ఎమ్మెల్యే శ్యాంబాబు భూమిపూజ చేయనున్నారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ఉదయం 10 గంటలకు నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి ఎంపీ బస్తిపాటి నాగరాజు, కలెక్టర్ రంజిత్ బాషా, అధికారులు హాజరుకానున్నారు.

## ముగిసిన ఉరుసు

దేవనకొండ, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): మూడు రోజుల పాటు జరిగిన ఉరుసు గురువారం జియారత్‌తో ముగిసింది. భక్తులు మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆదాయాన్ని సభ్యులు లెక్కించారు.

## అందరికీ ఉపాధి పనులు కల్పిస్తాం: ఏపీడీ

మద్దికెర, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): కూలీలు వలస వెళ్లవదని, పనులు కల్పిస్తామని ఏపీడీ మాధవీలత సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో 2024-25 సామాజిక తనిఖీ బహిరంగ సభ నిర్వహించారు. ఏపీడీ మాట్లాడుతూ మండలంలో 2023-24 ఏడాదికి రూ.8.68 కోట్ల పనులు కల్పించామన్నారు. అయితే కూలీలు సక్రమంగా లేని గ్రామాల్లో రూ.1.28లక్షల జరిమాన, రూ.54వేలు రికవరీకి ఆదేశించినట్లు తెలిపారు. సకాలంలో ప్రతి కూలీకి వేతనాలు అందేలా చూస్తామన్నారు. మండలంలో ఉపాధి కూలీల సంఖ్య పెంచాలని, ఉదయం 6 గంటలకే పనులకు వెళ్లాలని, తిరిగి సాయంత్రం కూడా వెళ్లవచ్చని తెలిపారు. ఎండలు ఎక్కువగా ఉండటంతో కూలీలకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాలని సిబ్బందిని ఆదేశించారు. జిల్లా విజిలెన్స్ అధికారి లోకేశ్వరుడు, ఏపీడీ ఫక్కీరప్ప, అడిషినల్ డీవీవో ఆదినారాయణ, జడ్పీటీసీ మురళి రెడ్డి, ఎంపీపీ అనిత, సర్పంచ్ బండారు సుహాసిని ఎంపీడీవో కొండయ్య, ఏపీవోలు నర్సిరెడ్డి, రవీంద్ర తదితరులు ఉన్నారు.


విచారణ చేస్తున్న ఏపీడీ మాధవీలత

## మోడల్ పాఠశాలలో ఇంటర్ ప్రవేశాలు

మద్దికెర, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): గ్రామంలోని ఆదర్శ పాఠశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సవిత పేర్కొన్నారు. మే 22లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని, ఓసీ, బీసీలకు రూ.200లు, ఎస్సీ, ఎస్టీలు రూ.150లు ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించాలన్నారు.

# వసతిలేని గృహాలు

● అద్దె భవనాలు, ఇరుకు గదుల్లో హాస్టళ్లు
● ఇబ్బంది పడుతున్న విద్యార్థులు


అద్దె భవనంలో కొనసాగుతున్న బీసీ కళాశాల విద్యార్థుల హాస్టల్


బీసీ బాలికల కళాశాల విద్యార్థుల హాస్టల్

ఆలూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీసీ కాలేజ్ హాస్టల్, బీసీ బాలుర, బాలికల హాస్టళ్లకు సొంత భవనాలు లేవు. ఇరుకు గదులతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గ్రామాల విద్యార్థులు ఆలూరులో వసతి గృహాల్లో ఉంటూ చదువుకుంటున్నారు. అయితే వారికి సరిపడ స్నానపు గదులు, మరుగుదొడ్లు లేవు. దీంతో నిత్యం ఇబ్బందులు తప్పడం లేదని, బహిర్భూమికి వెళ్లాల్సి వస్తోందని ఆవేదన చెందుతుతున్నారు.

**రూ.లక్షల్లో అద్దె**

బీసీ బాలుర, కళాశాల హాస్టల్‌తో పాటు బాలికల హాస్టళ్లు ఉన్నాయి. ఇవి మూడు అద్దె భవనాల్లో ఉండటంతో ఏటా ప్రభుత్వం రూ.లక్షల్లో అద్దె చెల్లిస్తోంది. బీసీ బాలుర కాలేజీ హాస్టల్ భవనానికి రూ.34వేలు, బాలుర హాస్టల్‌కి నెలకు రూ.52, 800లు, బాలికల హాస్టల్‌కు రూ.35 వేలు అద్దె చెల్లిస్తుంది. నెలకు రూ.1,21,800లు కాగా, ఏడాదికి రూ.14,61,600లు చెల్లిస్తోంది. ఈ హాస్టళ్లకు సొంత భవనాలు నిర్మిస్తే ప్రజాధనం ఆదా అయ్యే అవకాశం ఉంది.

**స్థలాలు కేటాయించారు**

ఆలూరు బీసీ బాలు, బాలికల కాలేజీ హాస్టళ్లకు హుళేబీడులో స్థలం కేటాయించారు. బాలుర హాస్టల్‌కు ముద్దనగేరి గ్రామంలో స్థలం కేటాయించారు. అక్కడ భవనాలు నిర్మిస్తే కళాశాల, పాఠశాలకు రావడానికి విద్యా ర్థులు ఇబ్బంది పడే అవకా శముంది.
- సంపత్, వార్డెన్, బాలుర హాస్టల్, ఆలూరు.

## దారితప్పిన విద్యార్థులు

● నెహ్రూ పాఠశాలలో ఫ్యాన్లు, లైట్ల ధ్వంసం

ఆదోని అగ్రికల్చర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని నెహ్రూ మెమోరియల్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు గురువారం ఫ్యాన్లు, లైట్లు ధ్వంసం చేశారు. చివరి గ్రాండ్ టెస్ట్ రాసిన అనంతరం తరగతి గదిలోని ఫ్యాన్లు, ట్యూబ్లైట్‌లను ధ్వంసం చేసినట్లు ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. ఉపాధ్యాయులు సరస్వతి పూజ చేయరాదని కఠినంగా వ్యవహరించడంతో మనసులో పెట్టుకున్న విద్యార్థులు రెచ్చిపోయినట్లు తెలుస్తోంది. ఫర్నిచర్లు, ఫ్యాన్లు, లైట్లను ఎవరు ధ్వంసం చేశారని విద్యార్థులను నిలదీస్తే తమపనే ఎదురు తిరుగుతున్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. అప్రమత్తమైన ఉపాధ్యాయులు రూ.లక్షల విలువ ఎలక్ట్రానిక్ సామగ్రి, పాఠాలు మానిటర్లను భద్రపరిచారు.


విద్యార్థులు ధ్వంసం చేసిన ఫ్యాను

## విద్యార్థులచే పారిశుధ్య పనులు

పత్తికొండ టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): విద్యార్థుల చేత పనులు చేయిస్తున్న ఏపీ ఆర్‌జేసీ పాఠశాల ప్రిన్సిపాల్‌ను సస్పెండ్ చేయాలని ఏఐఎస్‌ఎఫ్ మండల అధ్యక్షులు రమేష్, టౌన్ కార్యదర్శి రవికుమార్‌లు డిమాండ్ చేశారు. గురువారం మాట్లాడుతూ ప్రిన్సిపాల్ విద్యార్థులను కూలీలుగా మార్చి చెత్తాచెదార, కంప చెట్లను తొలగింపు పనులు చేయించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. విషపురుగులు, పాము, తేళ్ల కాటు వేస్తే ఎవరు బాధ్యులని ప్రశ్నించారు. జిల్లా ఉన్నతాదికారులు చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనకు దిగుతామని హెచ్చరించారు. ఈ విషయమై ప్రిన్సిపాల్ రామాంజినేయులు నాయక్‌ను వివరణ కోరగా స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌లో భాగంగా శుభ్రం చేయించామని తెలిపారు.


చెత్తను తొలగిస్తున్న విద్యార్థులు

## బీజేపీలో చేరిన హుసేనప్ప

ఆదోని టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఆర్టీఐ స్వచ్ఛంద సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు హుసేనప్ప యాదవ్ గురువారం ఎమ్మెల్యే పార్థసారథి సమక్షంలో విజయవాడలో బీజేపీలో చేరారు. ఎమ్మెల్యే ఆయనకు పార్టీ కండువా వేసి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్థసారథి రాకతో ప్రజల్లో నమ్మకం ఏర్పడిందని, శాశ్వత పరిష్కారం లభిస్తుందన్న భరోసా కలగడంతో పార్టీలో చేరానని హుసేనప్ప యాదవ్ అన్నారు.


కండువా వేసి పార్టీలోకి ఆహ్వానిస్తున్న పార్థసారథి

## టైలరింగ్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

వెల్దుర్తి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): వెనుకబడిన తరగతుల సహకార సంఘం ఆధ్వర్యంలో మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణకు దరఖాస్తులు ఆహ్వాని స్తున్నట్లు ఎంపీడీవో సుహాసినమ్మ పేర్కొ న్నారు. గురువారం ఎంపీపీ కార్యాల యంలో మాట్లాడుతూ ఈనెల 22వ తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని సూచిం చారు. 18 నుంచి 50 సంవత్సరాల్లోపు, బీసీ, ఈబీసీ, కమ్మ, రెడ్డి, క్షత్రియ, వైశ్య బ్రాహ్మణ, కాపు(బలిజ) కులాల మహిళలు అర్హులన్నారు. ఆధార్‌కార్డు, రేషన్ కార్డు, కులం సర్టిఫికెట్‌తో దగ్గర్లో ఉన్న సచివాల యంలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. శిక్షణ పూర్తయ్యాక కుట్టుమిషన్లను పంపిణీ చేస్తామని తెలిపారు.

## అభ్యంతరాలు తెలపండి

మద్దికెర, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): రబీ ఈ-పంట నమోదులో అభ్యంతరాలు ఉంటే తెలపాలని ఏవో రవి తెలిపారు. గురువారం రైతు సేవా కేంద్రాల్లో జాబితాను విడుదల చేశారు. 2024-25 రబీ సీజన్‌లో 19,798 ఎకరాల్లో పంటలు సాగు చేశారనీ తెలిపారు. పంట నమోదు పూర్తి చేశామన్నారు. అలాగే గ్రామ సభలు కూడా ఏర్పాటు చేస్తామని, ఔనెల 21లోపు అభ్యంతరాలు తెలపాలన్నారు.

## ఎల్లెల్సీ ఈఈగా పాండురంగయ్య



ఆదోని, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): తుంగభద్ర దిగువ కాలువ ఈఈగా పాండురంగయ్య గురువారం బాధ్యతలు చేపట్టారు. పోలవరం ఈఈ గా విధులు నిర్వహిస్తూ ఆదోనికి బదిలీపై వచ్చానన్నారు. రైతులకు అందుబాటులో ఉంటానని జలచౌర్యం నివారించడమే తన లక్ష్యమన్నారు.


పెద్దహోతూరులో ఉచ్చవీరప్ప రథోత్సవం

## ఉచ్చవీరప్ప రథోత్సవం

ఆలూరు రూరల్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని పెద్దహోతూరు ఉచ్చవీరప్ప, చలువప్ప రథోత్సవం గురువారం రమణీయంగా సాగింది. గురువారం ఉచ్చవీరప్ప తాత ఆలయంలో గణపతి పూజ, సర్వదేవత పూజ, సుదర్శన హోమం, పంచామృతాభిషేకం, పుష్పాలంకరణ, మహా మంగళ హారతి వంటి ప్రత్యేక పూజలను అర్చకులు సిద్దయ్య స్వామి, చంద్రమౌళి స్వామి నిర్వహించారు. మరకట్టు గ్రామం చలువప్ప తాతను పల్లకిలో ఊరేగించి పెద్దహోతూరు ఉచ్చవీరప్ప తాత ఆలయానికి చేరుకుంటారు. సర్పంచులు జోహరాపురం వీరేష్, విద్యా కమిటీ చైర్మన్ కెకెడీ చిన్న రామన్న, కురువ లక్ష్మన్న, ప్రకాష్ హోత్తూరప్ప, కరెంట్ దేవేంద్రప్ప, రవి కుమార్, కారన్న, శర్మష్ పాల్గొన్నారు.

## ఆదోనిలో అంతటా వలసలే..

● పాలకులు, ప్రకృతి పగపట్టాయి
● అసెంబ్లీలో ఎమ్మెల్యే పార్థసారథి



ఆదోని, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ఏ గ్రామానికి వెళ్లినా తాళం వేసిన ఇళ్లు కనిపిసాయని ఎమ్మెల్యే పార్థసారథి పేర్కొన్నారు. గురువారం అసెంబ్లీలో ఆయన మాట్లాడారు. 2.60 లక్షల మంది ఓటర్లు ఉన్న ఆదోనిలో లక్ష మందికి పైగా దూర ప్రాంతాలకు వలస వెళ్లారని ఆవేదన వ్యక్తం చేశారు. 30 ఏళ్లుగా పాల కులు, ప్రకృతి పగబట్టాయన్నారు. సమగ్ర సామాజిక ఆర్థిక సర్వేలో అత్యంత వెనుక బడిన జిల్లాగా కర్నూలు, నియోజకవర్గాలలో ఆదోని ఉందని ప్రభుత్వమే చెప్పిందని గుర్తు చేశారు. 87 శాతం భూమి బీడుగా ఉందని మంత్రికి తెలుసా అని ప్రశ్నించారు. సాగు నీరు పక్కన పెడితే తాగునీరు 10 లేదా15 రోజులకు ఒకసారి కుళాయిలు వదులు తున్నారని మంత్రిని అడిగారు. ఆదోనికి ఒకే ఎస్‌ఎస్ ట్యాంకు ఉందని, అదికూడా పాడైందన్నారు. స్పీకర్ కలగజేసుకొని వలస గురించి మాట్లాడాలని చెప్పారు. తమ ప్రాంతంలో ఒక్క పరిశ్రమ కూడా లేదన్నారు. అక్షరాస్యత లేని మహిళలు 78 శాతం మంది ఉన్నారన్నారు. బాల కార్మికులు దేశంలోనే అత్యధికంగా 7శాతం ఆదోనిలో ఉన్నారన్నది మంత్రికి తెలుసా అని అన్నారు. జూనియర్ కాలేజీ, డిగ్రీ కాలేజీ లేదని, ఆసుపత్రిలో 60 శాతం వైద్యుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని వివరించారు. ఆరోగ్యశ్రీ అతి తక్కువ క్లైమ్ చేస్తూ, ఆరోగ్య శ్రీ వర్తించదని చెప్పి రోగులను మోసం చేస్తున్నారన్నారు. రాష్ట్రంలో రెండో అతిపెద్ద మండలం ఆదోని అని, అతి తక్కువ డబ్బులు ఖర్చు పెట్టిన నియోజకవర్గం కూడా ఆదోనే అని మంత్రుల దృష్టికి తెచ్చారు. గ్రామీణా అభివృద్ధి, విద్య, వైద్యం, రోడ్లకు నిధులు విడుదల చేయలేదని ఆదోనిపై పగ పట్టారా అని ప్రశ్నించారు. ఇప్పటికైనా నిధులు విడుదల చేయాలని 34 సంవత్సరాలుగా వెనుకబడిన ఆదోనిని అభివృద్ధి చేయాలని ఎమ్మెల్యే అసెంబ్లీ దృష్టికి తెచ్చారు.

## ట్రాక్టరు, కారు ఢీ

● ఐదు మందికి తీవ్ర గాయాలు, కర్నూలుకు తరలింపు

ఆదోని అగ్రికల్చర్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): ఎమ్మిగనూరు నియోజకవర్గం కోటేకల్లు వద్ద గురువారం రాత్రి కారు, ట్రాక్టర్ ఢీ కొట్టుకోవడంతో ఐదు మందికి తీవ్ర గాయాలయ్యాయి. వివరాల మేరకు.. పట్టణంలోని విమల గార్డెన్ సిబ్బంది ఆదోనికి వస్తుండగా, ఎదురుగా వస్తున్న ట్రాక్టర్ ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న శుభత్ నాయక్ శ్రీనుతో పాటు మరో ఇద్దరికి తీవ్ర గాయాలు కాగా, ట్రాక్టర్ డ్రైవర్ వీరేష్ కూడా తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు ఆదోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు పరీక్షించి, పరిస్థితి విషమంగా ఉండడంతో మేరకు కర్నూలుకు రెఫర్ చేశారు.

## కిడ్డీస్ విద్యాసంస్థల వార్షికోత్సవం


నృత్యం చేస్తున్న విద్యార్థులు

ఆదోని, మార్చి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కిడ్డీస్ విద్యాసంస్థల వార్షికోత్సవ వేడుకలు గురువారం జరిగాయి. రెండు రోజులపాటు రెడ్డీస్ ఫంక్షన్ హాల్‌లో అమ్మా నాన్నకు ప్రేమతో.. కిడ్డీస్ రూట్స్ తరంగ్-25 అంటూ నిర్వహించిన వేడుకల్లో విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. డైరెక్టర్లు కేశవ నారాయణ రెడ్డి, చెన్నప్ప రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు గొప్ప ఆశయంతో మిమ్మల్ని చదివిస్తున్నారని ఆశయాలకు అనుగుణంగా రాణించాలని సూచించారు.

## పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

● ఆలూరు ఎంఈవో కోమలదేవి



ఆలూరు, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) : పదో తరగతి పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు చేసినట్లు ఆలూరు ఎంఈవో కోమల దేవి తెలిపారు

ప్రశ్న: ఆలూరులో ఎన్ని పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు?

జవాబు: మార్చి 17 నుంచి ఆరంభం కానున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు పట్టణంలో ఆరు కేంద్రాలను ఏర్పాటు చేశాం. ఇందులో ఏపీ మోడల్ స్కూల్, జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, సెయింట్ జాన్స్ ప్రగతి ఇంగ్లీష్ మీడియం స్కూల్ ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాల-1,2లలో కేంద్రాలు ఏర్పాటు చేశాం.

ప్రశ్న: ఎంత మంది విద్యార్థులు పరీక్షలు రాస్తున్నారు?

జవాబు: ఒక్కో పరీక్షా కేంద్రానికి 250 మంది చొప్పున 1,500 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరు కానున్నారు.

ప్రశ్న: పరీక్షా కేంద్రాల్లో విద్యార్థులకు అన్ని సౌకర్యాలు కల్పించారా?

జవాబు: పరీక్షా కేంద్రాల్లో బెంచీలు ఏర్పాటు చేశాం. అలాగే లైట్స్, ఫ్యాన్లు ఉండేలా చూస్తున్నాం. తాగు నీటి సౌకర్యంతో పాటు వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచాం.

ప్రశ్న: మాస్ కాపీయింగ్ జరగకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకుంటున్నారు?

జవాబు: ఆర్‌జేడీ, జిల్లా విద్యాశాఖాధికారి ఆదేశాల మేరకు ఒక్కో పరీక్ష కేంద్రంలో 12 మంది చొప్పున ఇన్విజిలేటర్లను నియమించాం. మాస్ కాపీయింగ్ జరగకుండా నిరంతర పర్యవేక్షణ ఉంటుది.

## మెరుగైన సేవలు అందించాలి: కమిషనర్



క్యాలెండర్‌ను ఆవిష్కరిస్తున్న మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి

**ఎమ్మిగనూరు, మార్చి13(ఆంధ్రజ్యోతి):** పట్టణ ప్రజలకు మెరుగైన సేవలందించాలని మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి సచివాలయం సిబ్బందికి సూచించారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో సచివాలయంలో విధులు నిర్వహిస్తున్న ప్లానింగ్ సెక్రటరీల సంఘం ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్‌ను కమిషనర్ గంగిరెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణంలోని ఆయా సచివాలయాల్లో విధులు నిర్వహిస్తున్న ప్లానింగ్ సెక్రటరీలు ప్రజలకు అందుబాటులో ఉండి వారి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీపీఓ రాజేష్, సిబ్బంది ఉరుకుందమ్మ, ప్లానింగ్ సెక్రటరీల సంఘం నాయకులు కిరణ్ కుమార్, బడేసాబ్, హరిష్, సచివాలయాల ప్లానింగ్ సెక్రటరీలు పాల్గొన్నారు.

## ఖోఖో విజేత కోసిగి బాలుర జట్టు



ట్రోఫీతో కోసిగి బాలురు జట్టు

**కోసిగి, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** మండలంలోని జంపాపురం బసవేశ్వర స్వామి జాతర, సుంకలమ్మ దేవర సందర్భంగా గ్రామానికి చెందిన ఉద్యోగుల ఆధ్వర్యంలో డివిజన్ స్థాయి ఖోఖో పోటీలు నిర్వహించారు. ఈ ఖోఖో పోటీలను కోసిగి బాలుర ప్రధానోపాధ్యాయులు ఖలీల్ అహ్మద్, పీడీ రాజారాం, ప్రధానోపాధ్యాయులు నాగరాజు పోటీలను ప్రారంభించారు. మొత్తం 14 జట్లు పాల్గొనగా బాలురు విభాగంలో కోసిగి బాలురు ఉన్నత పాఠశాల విద్యార్థులు మొదటి స్థానం కైవసం చేసుకున్నారు. వందగల్లు జట్టు రెండో స్థానంలో నిలిచింది. బాలికల విభాగంలో మొదటి స్థానం పెద్దతుంబళం జట్టు మొదటి స్థానం. కేజీబీవీ కోసిగి జట్టు రెండో స్థానంలో నిలిచాయి. గెలుపొందిన జట్లకు షీల్డ్‌తో పాటు క్రీడాకారులకు వ్యక్తిగత కప్పులను అందించారు. క్రీడా పోటీల్లో పాఠశాల పీడీ రామచంద్ర, జంపాపురం గ్రామానికి చెందిన ఉద్యోగులు బసవరాజు, తిక్కయ్య, చెన్నబసవ, లక్ష్మన్న, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## గోనెగండ్ల సీఐగా విజయభాస్కర్



**గోనెగండ్ల, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** గోనెగండ్ల మండల సీఐగా విజయభాస్కర్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ సీఐగా పని చేస్తున్న గంగాధర్ కర్నూలు వీఆర్‌కు బదిలీపై వెళ్లారు. నంద్యాల వీఆర్‌లో ఉన్న సీఐ విజయభాస్కర్ బదిలీపై గోనెగండ్లకు వచ్చారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన విజయభాస్కర్ మాట్లాడుతూ మండలంలో ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కల్పిస్తే వారిపై చర్యలు తీసుకుంటామన్నారు. ఇసుక, మద్యం, గుట్కా, మట్కా లాంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు.

● ప్రజలకు చేసిన సేవలు చిరకాలం గుర్తు ఉంటాయని ఎమ్మిగనూరు డీఎస్పీ ఉపేంద్రబాబు అన్నారు. గోనెగండ్ల సీఐ గంగాధర్ బదిలీపై వెళ్తున్న కారణంగా గురువారం రాత్రి పోలీస్‌స్టేషన్ పరిధిలో సన్మాన సభలో ఆయన మాట్లాడారు.

## పెండింగ్ గృహాలకు ఆర్థిక సాయం

**గోనెగండ్ల, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** పెండింగ్‌లో ఉన్న గృహాల నిర్మాణం కోసం కూటమి ప్రభుత్వ ఆర్థిక సాయం అందజేస్తుందని హౌసింగ్ ఏఈ షేక్షావలి అన్నారు. ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న గృహాలు నిర్మించుకునేందుకుగాను ప్రభుత్వం ఈ సహాయం చేస్తుందన్నారు. బీసీ, ఎస్సీ లబ్ధిదారులకు రూ. 50 వేలు, ఎస్టీలకు రూ. 75 వేలు అదనపు ఆర్థిక సహాయం అందజేస్తారన్నారు. మండలంలో బీసీలు 464 మంది, ఎస్సీలు 265 మంది, ఎస్టీలు ముగ్గురు, మొత్తం 732 మంది లబ్ధిదారులు గృహ నిర్మాణాలను పూర్తి చేసుకోకుండా పలు దశలలో ఆపి వేసి ఉన్నారని తెలిపారు. వారు ఇంటి పనులు చేపడితే మండలానికి రూ.3,66,75,000 లబ్ధి చేకూరుతుందని తెలిపారు.

## రాఘవేంద్రుని సన్నిధిలో కన్నడ నటి మాళవిక

**మంత్రాలయం, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** మంత్రాలయం రాఘవేంద్ర స్వామి దర్శనార్థం ప్రముఖ కన్నడ, తమిళ సినీ నటి మాళవిక అవినాష్ (కేజీఎఫ్)గురువారం రాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. ఈమెకు మహా ముఖ ద్వారం ఐపీ నరసింహమూర్తి, వ్యాసరాజాచార్‌లు ఘనంగా స్వాగతం పలికారు. గ్రామ దేవత మంచాలమ్మను దర్శించుకొని రాఘవేంద్ర స్వామి మూల బృందావనానికి విశేష పూజలు చేశారు. అనంతరం మఠం పండితులు మెమెంటో, శేష వస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు, పరిమళ ప్రసాదం ఇచ్చి ఆశీర్వదించారు. ఈమే వెంట జయతీర్థ ఆచార్, రంగస్వామి తదితరులు పాల్గొన్నారు.

## పీవైఎల్ నుంచి చిన్నిప్రసాద్ తొలగింపు

**ఎమ్మిగనూరు టౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** పీవైఎల్ నుంచి జిల్లా కన్వీనర్ చిన్నిప్రసాద్‌ను తొలగిస్తున్నట్లు ప్రగతిశీల యువజన సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కార్యదర్శి పల్లి సురేష్ ఓ ప్రకటనలో తెలిపారు. సంవత్సర కాలంగా చిన్నిప్రసాద్ పీవైఎల్ ఆశయాలు, లక్ష్యాలను కాలరాసే విధంగా వ్యవహరిస్తున్నారని అన్నారు. పలుమార్లు సరి చేయడానికి ప్రయత్నించినా పీవైఎల్ వ్యతిరేక చర్యలకు పాల్పడుతున్న బాధ్యతల నుంచి తొలగించామని చెప్పారు.

## గుండెపోటుతో వలస కూలీ మృతి

**పెద్దకడబూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** గుండెపోటుతో వలస కూలీ నరసప్ప మృతి చెందాడు. ఈ సంఘటన మండల పరిధిలోని చిన్నతుంభళం గ్రామంలో చోటు చేసుకుంది. నరసప్ప నెల రోజుల క్రితం బెంగళూరుకు వలస వెళ్లారు. అక్కడ కూలి పనులు చేస్తుండగా గుండెపోటు వచ్చి కుప్పకూలి మృతి చెందాడు. కుటుంబ సభ్యులు మృతదేహన్ని గ్రామానికి తీసుకొచ్చి అంత్యక్రియలు నిర్వహించారు. మృతదేహానికి గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు వీరేష్ గౌడ్, సిద్దప్ప గౌడ్‌లు పూలమాలల వేసి నివాళులర్పించారు.

## విద్యార్థులకు ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలి : ఎమ్మెల్యే

**ఎమ్మిగనూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** ఎమ్మిగనూరు మండలం బనవాసి గురుకుల కళాశాల విద్యార్థులకు ఏ ఇబ్బందులు రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి సూచించారు. ఏపీఆర్‌జేసీ కళాశాలలో చదువుతున్న ఇంటర్ విద్యార్థినులకు తీవ్ర జ్వరాలు రావటంతో అస్వస్థతకు గురైన విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే బీవీ గురువారం ఫోన్‌లో సబ్ కలెక్టర్, కళాశాల అధికారులతో మాట్లాడారు. వారి ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వరాలు వచ్చిన విద్యార్థినులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. వేసవిని దృష్టిలో ఉంచుకొని విద్యార్థినులకు అవసరమైన తాగునీరు, ఆహారాన్ని అందించాలన్నారు.

# ఎన్నేళ్లకు పూర్తయ్యేనో..!

● పదేళ్లుగా నిలిచిపోయిన స్త్రీశక్తి భవన నిర్మాణ పనులు
● వైసీపీ ప్రభుత్వంలో బిల్లులు నిలిచిపోయిన వైనం
● మధ్యలో వదిలివేసిన కాంట్రాక్టర్

**గోనెగండ్ల, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** పొదుపు మహిళల సౌలభ్యం కోసం పదేళ్ల క్రితం ప్రతి మండలంలో స్త్రీశక్తి భవనం కోసం ప్రభుత్వం కొంత నిధులను కేటాయించింది. కొన్ని మండలాల్లో పనులు ఎక్కడివి అక్కడే నిలిచిపోయాయి. గోనెగండ్లలో పదేళ్ల క్రితం స్త్రీశక్తి భవనం నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. నిధులు సక్రమంగా విడుదల కాకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి. ఇక ఏళ్లు గడుస్తున్నప్పటికీ పనుల్లో మార్పు కనిపించడం లేదు. నిలిచిపోయిన పనులకు చేసేందుకు కాంట్రాక్టర్ ముందుకు రావడం లేదు. దీంతో సగంలో నిలిచి పోయిన భవనాలు శిథిలావస్థలకు చేరే అవకాశాలు ఉన్నాయి. గత వైసీపీ ప్రభుత్వం నిధులు కేటాయించకపోవడంతో ఈ పరిస్థితి ఏర్పడింది.

**భవన నిర్మాణం కోసం రూ. 33 లక్షలు మంజూరు**

గత పదేళ్ల క్రితం అప్పటి ప్రభుత్వం గోనెగండ్లలో స్త్రీశక్తి భవన నిర్మాణం కోసం రూ.33 లక్షలు విడుదల చేసింది. ఆ నిధులతో అప్పటి కాంట్రాక్టర్ భవన నిర్మాణ పనులు చేపట్టారు. అయితే ప్రభుత్వాలు మారడం వల్ల నిధుల విడుదలలో జాప్యం జరిగింది. గత వైసీపీ ప్రభుత్వం భవన నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా విడుదల చేయలేదు. ఈ కారణంగా కాంట్రాక్టర్ పనులను మధ్యలోనే వదిలివేసి వెళ్లిపోయాడు. నేటికీ పనులు పూర్తి కాలేదు. గదులలో బండపరుపు, విద్యుత్ సౌకర్యం, రంగులు వేసే పనులు చేపట్టాల్సి ఉంది. దీంతో స్త్రీశక్తి భవనం అద్దె భవనంలో కొనసాగుతోంది.

**పొదుపు గ్రూపుల సమావేశాలకు ఇబ్బందులే..**

గోనెగండ్ల మండల వ్యాప్తంగా 1621 పొదుపు గ్రూపులు ఉన్నాయి.



గోనెగండ్లలో నిలిచిపోయిన స్త్రీ శక్తి భవనం

పొదుపు గ్రూపుల సమావేశాలు ఇతర పనులుకు అద్దె భవనం సరిపోవడం లేదు. ప్రస్తుతం అద్దె భవనంలోనే నిర్వహిస్తున్నారు. ఇరుకు గదులలో ఇబ్బందులు పడుతూ సమావేశాలు జరుపుకుంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి నిధులను మంజూరు చేయించి భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని మండల పొదుపు మహిళలు కోరుతున్నారు.

**అదనపు నిధుల కోసం ప్రతిపాదనలు పంపుతాం**

గతంలో మంజూరైన నిధులతో భవన నిర్మాణ పనులు చేపట్టారు. అయితే భవన నిర్మాణ పూర్తి కాలేదు. నిధులు నిలిచిపోవడంతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. భవనం పనులు పూర్తి కావడానికి అదనపు నిధులు అవసరం. భవనం పనులు పూర్తి చేయడానికి అదనంగా మరో రూ. 10 లక్షల నిధుల కావాల్సి ఉంది. అందుకు గాను ప్రపోజల్స్ తయారు చేసి ఉన్నతాధికారులకు పంపుతాం. నిధులు విడదలైన వెంటనే పనులు చేపడతాం.

- శివశంకర్, పీఆర్ ఏఈ, గోనెగండ్ల

## వైభవంగా ధీరేంద్ర తీర్థుల మహా రథోత్సవం

**మంత్రాలయం, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** మంత్రాలయం రాఘవేంద్ర స్వామి పూర్వపు పీఠాధిపతి ధీరేంద్ర తీర్థుల మహా రథోత్సవం వైభవంగా నిర్వహించారు. గురువారం ఉత్తరాధన ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. కర్ణాటకలోని హవేరి జిల్లా హొసరుత్తిలో వెలసిన ధీరేంద్ర తీర్థుల బృందావనానికి మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ప్రత్యేక పూజలు చేశారు. వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల లోక కళ్యాణార్థం మాన్యసూక్త హోమాన్ని నిర్వహించి పూర్ణాహుతి చేశారు. బృందావనానికి నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, విశేష పంచామృతాభిషేకం నిర్వహించి బంగారు, వెండి ఆభరణాలతోపాటు, పట్టు వస్త్రాలు, ప్రత్యేక పుష్పాలతో శోభాయమానంగా అలంకరించిన దృశ్యం భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్వామివారిని పల్లకిలో ఊరేగించిన అనంతరం మహా రథంపై అధిష్టించి ఆలయ ప్రాంగణం చుట్టూ ఊరేగించారు. అనంతరం బృందావనానికి హస్తోదకం చేసి పీఠాధిపతి మహా మంగళ హారతి ఇచ్చారు. అక్కడే సంస్థాన పూజలో భాగంగా మూలరాములకు విశేషంగా బంగారు ఆభరణాలతో అభిషేకం చేశారు. వందలాది మంది పాల్గొన్న భక్తులకు పీఠాధిపతి శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో ఎస్ఎన్ వెంకటేష్ ఆచార్, వాజేంద్ర ఆచార్, సూరీంద్ర ఆచార్, ద్వారపాలక అనంతస్వామి, ప్రకాష్‌ఆచార్, పవన్ ఆచర్, విజయేంద్రాచార్, ఆనంద తీర్థ ఆచర్, గౌతమ్ ఆచార్, గోపాలకృష్ణస్వామి, వరదేంద్రాచార్ పాల్గొన్నారు.



భక్తులనుద్దేశించి మాట్లాడుతున్న పీఠాధిపతి

## జనసేన సభకు బయలుదేరిన జన సైనికులు



పిఠాపురానికి బయలుదేరిన పెద్దకడబూరు జనసైనికులు

**పెద్దకడబూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని జనసేన నాయకులు గురువారం పిఠాపురంలో జరిగే 11వ జనసేన పార్టీ ఆవిర్భావ దినోత్సవానికి బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా నాయకులు జీలకర గణేష్, రామాంజినేయులు మాట్లాడుతూ పార్టీ స్థాపించిన అనతి కాలంలోనే 21 సీట్లు సాధించి కూటమి ప్రభుత్వంలో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సాధించిందన్నారు. రాష్ట్ర ప్రజల సంక్షేమం కోసం జనసేన పార్టీ వ్యవస్థాపకుడు పవన్‌కళ్యాణ్ ఎంతోగానో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో జనసేన నాయకులు ఏసేబు, గోవిందు, ఆకాశ్, మహమ్మద్, మహదేవ, అబ్దుల్, ఖాదర్, రాంప్రసాద్, చంద్ర, రాఘవేంద్ర పాల్గొన్నారు.

## బ్యాంకు సమ్మెకు సీఐటీయూ మద్దతు

**ఎమ్మిగనూరు టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):** కేంద్ర ప్రభుత్వం బ్యాంకులలో ఉన్న ఖాళీ పోస్టులు భర్తీ చేయాలని మార్చి 24, 25 ఉద్యోగులు చేపట్టే సమ్మెకు సీఐటీయూ నాయకులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా గురువారం సీఐటీయూ తాలుకా కార్యదర్శి రాముడు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఆర్థిక మంత్రి శాఖ ప్రస్తుతం బ్యాంకుల్లో ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించకుండా కాలయాపన చేస్తోందని అన్నారు. ఏళ్ల తరబడి బ్యాంకుల్లో పోస్టులు భర్తీ చేయకుండా ఫిక్స్‌డ్ టర్మ్ ఉద్యోగులను నియమించడం సరైనది కాదన్నారు. దేశవ్యాప్తంగా బ్యాంక్ యూనియన్స్ ఆధ్వర్యంలో చేపటే సమ్మెకు సంపూర్ణ మద్దతు తెలిపి ప్రత్యక్షంగా బ్యాంకు ఉద్యోగులకు అండగా ఉంటుందని తెలిపారు. కార్యక్రమంలో బ్యాంకు నాయకులు వీరేష్, నారాయణ, రాజు, ఖాజా పాల్గొన్నారు.

## ప్రతి ఇంట్లో వైద్య పరీక్షలు నిర్వహించాలి

**గోనెగండ్ల, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** మండలంలోని ప్రతి ఇంట్లో వైద్య పరీక్షలు నిర్వహించాలని ప్రభుత్వ వైద్యురాలు రంగారవళి అన్నారు. గురువారం మండల పరిధిలోని అగ్రహారం గ్రామంలో ఎఫ్‌డీపీ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంట్లో వైద్య పరీక్షలు నిర్వహించి బీపీ, సుగర్ వ్యాధి, దీర్ఘకాలిక రోగాలు ఉన్న వారి సంఖ్యను పరిగణనలోకి తీసుకునున్నట్లు వైద్యులు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యురాలు రంగారవళి మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు దాదాపు 75 శాతం సర్వే పనులు పూర్తి చేశామన్నారు. స్థానిక ఆరోగ్య శాఖ సిబ్బందితో మాట్లాడారు. సమస్యలు ఉంటే చెప్పాలని కోరారు. ప్రజలకు సేవలు అందుతున్నట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఎంపీహెచ్‌వో హనుమంతు, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత వైసీపీకి లేదు

**కోసిగి, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):** కూటమి ప్రభుత్వాన్ని విమర్శించే అర్హత వైసీపీ నాయకులకు లేదని టీడీపీ కోసిగి మండల నాయకుడు చింతలగేని నరసారెడ్డి అన్నారు. గురువారం విలేఖర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. వైసీపీ చేపట్టిన యువత పోరు కార్యక్రమంలో కూటమి ప్రభుత్వం, ముఖ్యమంత్రిపైన వైసీపీ ఎమ్మెల్యేలు, నాయకులు విమర్శలు చేయడం హాస్యాస్పదమన్నారు. నాయకులు గడ్డం గోపాల్, ఉప్పలపాటి అర్జున్, సాతనూరు రామిరెడ్డి, నరసన్న పాల్గొన్నారు.

## చిన్నారులతో హోలీ సంబరాలు

**మంత్రాలయం, మార్చి 13 (ఆంధ్రజ్యోతి) :** మండలంలోని మధవరం అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులతో కలిసి హోలీ సంబరాలు ఘనంగా జరుపుకున్నారు. గురువారం అంగన్‌వాడీ సూపర్ వైజర్ నాగలక్ష్మి ఆధ్వర్యంలో టీచర్లు తులసమ్మ, అనిత, నర్సమ్మ, మాధురి, విశాలాక్షిలు రంగులు పూసుకుంటూ సంబరాలు చేసుకున్నారు. హనికరమైన రంగులు వాడకుండా హోలీ జరుపుకోవాలని సూపర్‌వైజర్ నాగలక్ష్మి అన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఆయాలు అనిత, నర్సమ్మ, రబియా, రుభియా, సుజాత పాల్గొన్నారు.

## సీఎం చంద్రబాబు దార్శనికతకు నిదర్శనం

**అసెంబ్లీలో ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి**



మాట్లాడుతున్న జయనాగేశ్వర రెడ్డి

**ఎమ్మిగనూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** విద్యుత్ చార్జీలు పెంచకుండా బడ్జెట్‌ను పెట్టడం ముఖ్యమంత్రి చంద్రబాబు దార్శనికతకు నిదర్శనమని ఎమ్మిగనూరు ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వర రెడ్డి అన్నారు. గురువారం రాష్ట్ర అసెంబ్లీలో ప్రశ్నోత్తరాల సమయంలో ఎమ్మెల్యే బీవీ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం తొమ్మిది సార్లు కరెంటు బిల్లులు పెంచి కరెంటు తీగలు పట్టుకుంటే కాదు కరెంటు బిల్లులు పట్టుకుంటే షాక్ కొడుతుందనే విధంగా ప్రజలపై భారం వేసిందని అన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి ఒక్క రుపాయి కూడా పెంచకుండా బడ్జెట్ పెట్టారని తెలిపారు. దాదాపు 2024-25 ఆర్థిక సంవత్సరానికి రూ. 8205, కోట్లు, అలాగే రూ. 13,600కోట్లు ఏడాదికి కేటాయించి, విద్యుత్ చార్జీలు పెంచేదిలేని గర్వంగా చెప్పిన విద్యుత్ శాఖ మంత్రికి ధన్యవాదాలు తెలుపుతున్నానని చెప్పారు. అలాగే జీడీపీలో విద్యుత్ రంగంలో అత్యంత కీలకమైన సెక్టోరియల్ డెవలప్‌మెంట్‌లో కూడా ప్రాంతాల వారీగా విద్యుత్ రంగాన్ని రాయలసీమలోని కర్నూలు పార్లమెంటులో నాన్ కన్వర్షన్ ఎనర్జీ సోలార్‌ను విందును ఏర్పాటు చేసి కూటమి ప్రభుత్వం ముందుకు తీసుకుపోతుందని తెలిపారు.

## ఖాతాదారులకు మెరుగైన సేవలందిస్తున్నాం



మాట్లాడుతున్న బ్యాంకు చైర్మన్

**ఎమ్మిగనూరు, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** బ్యాంకు ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామని ఎమ్మిగనూరు టౌన్ బ్యాంకు చైర్మన్ ఉరుకుందయ్య, వైస్ చైర్మన్ నరసనప్ప అన్నారు. గురువారం బ్యాంకులో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో వారు మాట్లాడుతూ చిరు వ్యాపారులకు, చిన్న చిన్న పనులు చేసుకొని జీవనం సాగించే వారికి రుణాలు ఇస్తున్నామన్నారు. ఎవరికైనా రూ.5 లక్షలకు మించి అప్పు ఇవ్వటం లేదన్నారు. బ్యాంకు నిబంధనల మేరకే రుణాలు ఇస్తామని తెలిపారు. ఇటీవల బ్యాంకు ఖాతాదారుడు రూ.1.2 లక్షలు రుణం ఇవ్వాలని కోరాడని, ఇందుకు తక్కువ స్థలం ఉండటంతో రూ.50 వేల వరకు ఇస్తామని చెప్పారని అన్నారు. దీంతో సదరు ఖాతాదారుడు అనవసరంగా రాద్ధాంతం చేశాడని తెలిపారు. సమావేశంలో బ్యాంకు డైరెక్టర్లు రవి, వాల్మీకి రాజు, వెంకటేశ్వర రెడ్డి, షాలేం, భీమేష్ పాల్గొన్నారు.

## టైలరింగ్ శిక్షణకు దరఖాస్తులు

**నందవరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** మండలంలో టైలరింగ్ శిక్షణ నేర్చుకోవాలనే మహిళ ఈ నెల 22 వరకు దరఖాస్తు చేసుకోవచ్చని ఎంపీడీవో పుల్లయ్య తెలిపారు. గురువారం ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల కోసం ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చి వారి శిక్షణ పూర్తయ్యాక ఉచితంగా కుట్టు మిషన్లు కూడా పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు.

# మంత్రాలయంలో భక్తుల రద్దీ

**మంత్రాలయం, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** రాఘవేంద్ర స్వామి దర్శనార్థం భక్తులతో మంత్రాలయం కిక్కిరిసింది. గురువారం వివిధ రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నా వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాల మధ్య రాఘవేంద స్వామి మూల బృందావనానికి బంగారు కవచం సమర్పణతో పాటు విశేష పుష్పాంకరణ సేవ చేశారు. రాఘవేంద్రస్వామి సజీవ సమాధి పొందిన పాల్గుణ చతుర్దశి గురువారం శుభదినాన్ని పురస్కరించుకొని మఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ఆశీస్సులతో మఠం పండితులు బృందావనానికి సుప్రభాతం, నిర్మల విసర్జనం, క్షీరాభిషేకం, తులసి అర్చన, విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. బంగారు, వెండి, పట్టు వస్త్రాలు, బెంగళూరు నుంచి తెచ్చిన ప్రత్యేక పుష్పాలు, బంగారు కవచంతో చూడ ముచ్చటగా అలంకరించారు. ఇది భక్తులను ఎంతగానో ఆకట్టుకుంది. పండితులు పూజలు, హస్తోదకం చేసి మహా మంగళహారతులు చేశారు.

**రాఘవేంద్ర స్వామి మఠానికి రూ.3 లక్షల విరాళం :** మంత్రాలయం రాఘవేంద్రస్వామి మఠానికి ముంబయికి చెందిన శశికళ పాటిల్ అనే భక్తురాలు రూ.2 లక్షలు శాశ్వత సేవకు, అదే పట్టణానికి చెందిన కాంచన మంగలవేడి అనే భక్తురాలు రూ.లక్ష సుజయీంద్ర ఆరోగ్య శాలకు విరాళంగా ఇచ్చినట్లు మఠం ఏఏఓ మాధవశెట్టి, మేనేజర్లు వెంకటేష్ జోషి, సురేష్ కోణాపూర్‌లు తెలిపారు. గురువారం వేర్వేరు సమయాల్లో కుటుంబ సమేతంగా రాఘవేంద్ర స్వామిని దర్శించుకుని రూ.3 లక్షల నగదును విరాళం ఇచ్చినట్లు చెప్పారు. విరాళం ఇచ్చిన దాత కుటుంబానికి శ్రీమఠం పండితులు రాఘవేంద్ర స్వామి మెమెంటో, శేషవస్త్రం, ఫల, పుష్ప, మంత్రాక్షితలు ఇచ్చి ఆశీర్వదించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ మేనేజరు ఐపీ నరహింహ మూర్తి, సూపర్నిడెంట్ అనంతపురాణిక్, నరసింహ దేశాయ్, గిరిధర్, శ్రీపాద ఆచార్‌లు పాల్గొన్నారు.



శ్రీమఠం ప్రాంగణంలో కిక్కిరిసిన భక్తులు

## శ్మశాన వాటికలో ముళ్ల కంపల తొలగింపు

**నందవరం, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** మండల పరిధిలోని నాగలదిన్నెలో ఎమ్మెల్యే ఆదేశాల మేరకు ఎంపీడీవో పుల్లయ్య శ్మశాన వాటికలో ముళ్ల కంపలను గురువారం నుంచి ముళ్లకంపల తొలగింపు కార్యక్రమం చేపట్టారు. నాగలదిన్నె మైనార్టీలు ఎమ్మెల్యే బీవీ దగ్గరకు వెళ్లి రంజాన్ పండగ వస్తుందని ఈద్గా దగ్గరకు వెళ్లాలంటే మొత్తం ముళ్ల కంపలతో నిండి పోయిందని ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గురువారం ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి ఎంపీడీవో పుల్లయ్యకు వెంటనే ముళ్లకంపలు తొలగించాలని ఆదేశించడంతో అధికారులు పని మొదలు పెట్టారు. ఎమ్మెల్యే బీవీకు అభినందనలు తెలుపుతూ నాగలదిన్నె ముస్లింలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలోఎంపీడీవో పుల్లయ్య, పంచాయతీ కార్యదర్శి నౌసన్న, టీడీపీ మైనార్టీ మండల అధ్యక్షుడు జబ్బార్, వహబ్, టీడీపీ యూత్ నాయకులు మునాఫ్, మహబూబ్, సుల్తాన్, నబిరసుల్, వలి, సలీం పాల్గొన్నారు.

## హాస్టళ్లు ఏర్పాటు చేయాలి: ఎస్ఎఫ్ఐ



మాట్లాడుతున్న ఎస్ఎఫ్ఐ నాయకులు

**ఎమ్మిగనూరు టౌన్, మార్చి 13 (ఆంధ్రజ్యోతి):** పట్టణంలో బీసీ ప్రీమెట్రిక్, పోస్ట్ మెట్రిక్ హస్టళ్లకు సొంత భవనాలు కేటాయించాలని ఎస్ఎఫ్ఐ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం పట్టణ అధ్యక్షుడు రాము అధ్యక్షతన కేవీపీఎస్ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి రంగప్ప పట్టణ కార్యదర్శి విజయ్ మాట్లాడారు. ఎమ్మిగనూరు చుట్టు పక్కల ఉన్న మండలాలు, పల్లెల్లోని పేద విద్యార్థులు ఉన్నత చదువుల కోసం ఎమ్మిగనూరులోని ప్రభుత్వ పాఠశాలలో చేరుతు న్నారని అన్నారు. అయితే వారికి హస్టల్ సౌకర్యం ఇబ్బంది పడుతున్నారని తెలిపారు. బీసీ సంక్షేమ శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే బీవీ జయనాగేశ్వరరెడ్డి స్పందించి రాబోయే విద్యా సంవత్సరంలోపు అన్ని మౌలిక వసతులతో కూడిన బీసీ ప్రీమెట్రిక్, పోస్టమెట్రిక్ హస్టళ్లు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

## అక్రమ నిర్మాణాలను అరికట్టండి

**ఎమ్మిగనూరు రూరల్, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** ఎమ్మిగనూరు పట్టణంలోని మంత్రాలయం రోడ్డు సమీపంలో అక్రమ నిర్మాణాలకు పాల్పడుతున్న వారిపై విచారించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కృష్ణమోహన్, వెంకటేశులశెట్టి, శ్రీనివాసులశెట్టిలు కోరారు. గురువారం తహసీల్దార్ శేషఫణిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పట్టణంలోని గుర్రేవుల రైస్‌మిల్ కాంపౌండ్ పరిసరాలలో నివాసాలు, చిన్న చిన్న పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని జీవనం సాగిస్తున్నామన్నారు. గుర్రేవుల రైస్‌మిల్ కాంపౌండ్ డోర్ నెంబర్లు 377-8-1, 377-9-10-11-12, లలో ఎమ్మిగనూరు మండలం కె.నాగలాపురం గ్రామానికి చెందిన గ్రంధి విజయలక్ష్మి ఆమె భర్త శ్యామ్‌లు అక్రమంగా తమ చర్చి నిర్మాణం చేయాలని చూస్తున్నారన్నారు. చర్చి నిర్మించాలకునే స్థలం కోర్టు వివాదంలో ఉందన్నారు. ఈ ప్రాంతంలో చర్చి నిర్మాణం జరిగితే మతపరమైన సమస్యలే గాక, పర్యావరణ, ట్రాఫిక్ సమస్యలు సైతం తలెత్తుతాయన్నారు. రెవెన్యూ అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలని కోరారు.

## దివ్యాంగురాలికి మల్లెల గ్రూప్స్ చేయూత

**ఎమ్మిగనూరు టౌన్, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** పట్టణంలోని కలుగట్ల రోడ్డు ఎస్సీ కాలనీలో నివాసం ఉంటున్న దివ్యాంగురాలైన శ్యామలకు మల్లెల గ్రూప్ తరపున మల్లెల జీవన్ సుశీల్ ఆర్థిక సాయం చేసి చేయూత అందించారు. ఈ సందర్భంగా గురువారం వారు మాట్లాడుతూ ఎస్సి కాలనీకి చెందిన దివ్యాంగురాలైన శ్యామల తల్లిదండ్రులు ఆనారోగ్యంతో మంచాన పడడంతో కుటుంబ పోషణకు ఇబ్బందిగా మారింది. దివ్యాం గురాలు శ్యామలకు వస్తున్న ప్రభుత్వ పింఛన్ కుటుంబ పోషణకు సరిపోకపోవడంతో ఆమె పండ్ల వ్యాపారం చేయాలని ఆలోచించగా మల్లెల అల్‌ఫ్రెడ్ రాజుకు ఆర్థిక సాయం కోరగా అందుకు స్పందించి అల్‌ఫ్రెడ్ రాజు కుమారుడు జీవన్ సుశీల్ చలించి పండ్ల వ్యాపార నిర్వహణకు వెంటనే ఆర్థిక సాయం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో కదిరి కోట అదెన్న, బాలు, మహేష్ పాల్గొన్నారు.

## ఆటో బోల్తా.. ముగ్గురికి గాయాలు

**మంత్రాలయం, మార్చి 13(ఆంధ్రజ్యోతి):** మండలంలోని చెట్నహళ్లి గ్రామంలో సీఎస్ఐ చర్చి వద్ద బసాపురం గ్రామానికి చెందిన ఆటో బోల్తాపడి ముగ్గురు భక్తులకు గాయాలయ్యాయి. ఈ రోడ్డు ప్రమాదం గురువారం జరిగింది. గ్రామస్థుల వివరాల ప్రకారం.. తుంగభద్ర రైల్వేస్టేషన్ నుంచి తమిళనాడుకు చెందిన భక్తులను ఆటోలో ఎక్కించుకొని మంత్రాలయం వస్తుండగా చెట్నహళ్లి వద్ద రోడ్డుకు అడ్డంగా బారికేడ్లను ఢీ కొట్టడంతో ఆటో బోల్తా పడింది. దీంతో తమిళనాడుకు చెందిన ఇద్దరి భక్తుల కాళ్లు విరిగాయి. మిగతా వారికి స్వల్ప గాయాలయ్యాయి. గ్రామస్థులు గాయపడిన వారిని చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ గాయపడిన భక్తులకు దగ్గర ఉండి సొంత ఖర్చుతో చికిత్స అందిస్తున్నట్లు మంత్రాలయం ఎస్ఐ శివాంజల్ తెలిపారు.